www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 155 | గురువారం 23.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



- జేపీ నడ్డా ఇంటికి వెళ్లేది లేదు: సీజేపీ
- చర్చలు కావాలంటే జంతర్ మంతర్‌కే రావాలి
- ప్రజల మధ్యే చర్చలకు సిద్ధం: సౌరవ్ దాస్
- తటస్థ వేదికైనా మాకు అభ్యంతరం లేదు
- చర్చలకు ముందు ప్రభుత్వ ఉద్దేశం స్పష్టం చేయాలి
- అర్థంలేని చర్చలకు సమయం వృథా చేయం
- ప్రభుత్వం నిజాయితీగా ముందుకొస్తేనే చర్చలు
- జనతా దర్బార్‌లోనే కేంద్రంతో చర్చలు జరగాలి
- ప్రజల ముందే చర్చించాలన్న సీజేపీ డిమాండ్
- కేంద్రం స్పందన కోసం వేచి చూస్తున్న సీజేపీ 02

కోట్లాది యువత ఢిల్లీకి వస్తారు
కేంద్రానికి సీజేపీ హెచ్చరిక

# ఇది ట్రైలర్ మాత్రమే

## నడ్డానే జంతర్ మంతర్‌కు వచ్చి చర్చించాలి..

### దేశవ్యాప్తంగా యువశక్తిని సమీకరిస్తామని సీజేపీ హెచ్చరిక

**న్యూ ఢిల్లీ :**
దేశ రాజధాని ఢిల్లీ వేదికగా సాగుతున్న సీజేపీ నిరసనలు, ఉద్రిక్తతలు, హింసపై సీజేపీ జాతీయ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థి, యువజన ఉద్యమం స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పోరాటంగా రూపుదిద్దుకుంటోందని అశుతోష్ రంకా వ్యాఖ్యానించారు. ఈ నెల 20న జరిగిన నిరసన కేవలం ఒక 'ట్రైలర్' మాత్రమేనని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యువకులు ఢిల్లీకి తరలివస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యువత ఆగ్రహానికి గురికాక ముందు ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు.గత 31 రోజులుగా గాంధీ, అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, అయితే పోలీసులు...



### ఢిల్లీ హైకోర్టు సెన్సేషనల్ ఆర్డర్స్



- 'సంసద్ చలో' ఘటనపై ఢిల్లీ హైకోర్టు విచారణ
- విద్యార్థులపై పోలీసుల దాడులపై పిల్‌కు విచారణ
- సీసీటీవీ ఫుటేజీలు భద్రపరచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం
- ఎస్ఓపీ ప్రకారం అన్ని రికార్డులు భద్రపరచాలని సూచన
- పోలీసుల సమాధానం కోరిన ఢిల్లీ హైకోర్టు 02




# నరేందర్, ధర్మేందర్ కలిసి లూటీ

## 'సడక్ టు సంసద్' పోరాటం తెలంగాణ నుంచే

గాంధీ వారసులు గాడ్సే వారసుల మధ్యే పోరాటం

దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం

కొడంగల్ లో నాపై కుట్ర చేస్తున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

- నీట్ లీక్‌పై కేంద్రంపై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్
- 'సడక్ టు సంసద్' పోరాటం తెలంగాణ నుంచే ప్రారంభిస్తాం
- విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ పాశవికమని మండిపాటు
- ప్రధాని నరేందర్, ధర్మేంద్ర దేశాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపణ 03
- గాంధీ వారసులు - గాడ్సే వారసుల మధ్యే పోరాటమని రేవంత్
- పార్లమెంట్‌లో నీట్ చర్చకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శ

నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు.ఆడపిల్లలపై దాడి చేశారని....

### 22% ఓట్లు పెండింగ్.. అత్యంత ప్రమాదకరం!

'నీట్' బాధితులకు అండగా.. విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్

అంబేద్కర్ చౌరస్తాలో వేడెక్కిన రాజకీయం




గతములో ఫ్లాష్ ఇండియా లో న్యూస్ కు స్పందించిన అధికారులు





# జనగామ పట్టణంలో సెల్లార్‌ల తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు





- జనగామలో సెల్లార్‌ల దుర్వినియోగంపై మున్సిపాలిటీ ఉక్కుపాదం
- పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్‌లపై ప్రత్యేక తనిఖీలు
- సెల్లార్‌లను దుకాణాలుగా మార్చితే కఠిన చర్యలు: మున్సిపాలిటీ
- నిబంధనలు ఉల్లంఘించిన భవన యజమానులకు మున్సిపల్ హెచ్చరిక 06
- జనగామలో అక్రమ సెల్లార్ వినియోగంపై అధికారులు అప్రమత్తం
- భవన యజమానులకు మున్సిపల్ వార్నింగ్.. సెల్లార్‌లు పార్కింగ్‌కే
- నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై మున్సిపాలిటీ ఫోకస్



# బియ్యం కోటా భారీ పెంపు.!

- తెలంగాణకు బియ్యం సేకరణ లక్ష్యం పెంపు
- ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు
- పెరిగిన కోటాను పూర్తిగా వినియోగించాలన్న సూచన
- రైతులకు మేలు.. కొనుగోళ్లు వేగవంతం కానున్నాయి 02

# కాంగ్రెస్ ధర్నాలు రాజకీయ డ్రామాలే

## రేవంత్ సర్కార్ ధర్నాలు పెద్ద జోక్

రాహుల్ ప్రధాని కావడం, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కలే

ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ఆందోళనలు

సాగునీరు, ఎరువుల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం



నీట్ దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమన్న బండి

- కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ లేదన్న బండి సంజయ్
- ప్రతిపక్ష హోదాను నిలబెట్టుకునేందుకే కాంగ్రెస్ ధర్నాలు
- కాంగ్రెస్ కంటే 'కాక్రోచ్ పార్టీ'తోనే పోటీ: బండి సంజయ్
- రాహుల్ ఉన్నంతకాలం బీజేపీకే లాభమని వ్యాఖ్యలు
- ప్రధాని నివాసం ముందు ఆందోళనతో శాంతిభద్రతలకు విఘాతం
- చట్టం తన పని తాను చేసిందన్న కేంద్ర మంత్రి
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌కు రావాలి 03

ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ధర్నాలను రాజకీయ డ్రామాలు అంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్‌ను అసలు ప్రతిపక్షంగానే ప్రజలు గుర్తించడం లేదని, కేవలం రాజకీయ నాటకాలతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. సీజేపీ (కాక్రోచ్ పార్టీ)తో పోటీ పడేందుకే కాంగ్రెస్ ఇటువంటి ధర్నాలకు దిగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. రాహుల్ గాంధీ బీజేపీకి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం బీజేపీకే లాభమని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీపై తాము దౌర్జన్యం చేయాల్సిన అవసరం లేదని, ప్రధాని నివాసం ముందు ధర్నా పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని స్పష్టం చేశారు.







# ట్రాన్స్‌కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

## భారీ మొత్తంలో ఆస్తులు గుర్తింపు.!

వ్యవసాయ భూములు, ప్లాట్ల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

ఆదాయ వనరులు, పెట్టుబడులపై లోతైన విచారణ

- ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 10కిపైగా చోట్ల సోదాలు
- మాదాపూర్, పాల్వంచ సహా పలు ప్రాంతాల్లో ఏకకాల తనిఖీలు
- 10 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా కొనసాగుతున్న ఏసీబీ ఆపరేషన్
- ఇంట్లో ఖరీదైన వాచీలు, విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం
- వ్యవసాయ భూములు, ప్లాట్ల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు 02

# ట్రాన్స్కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ప్రభుత్వ అధికారిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌కోలో డివిజనల్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ముత్యం వెంకటరమణకు సంబంధించిన నివాసాలు, బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి ఏసీబీ బృందాలు రంగంలోకి దిగాయి. మాదాపూర్‌లోని మీనాక్షి టవర్స్‌లో ఉన్న ఏడో అంతస్తు ఫ్లాట్ సహా రాష్ట్రంలోని మొత్తం 10కి పైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 10 ప్రత్యేక బృందాలు పాల్గొన్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లా పాల్వంచలోని ఆస్తులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన నివాసాల్లో కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు. సోదాల సందర్భంగా ఇంట్లో విలాసవంతమైన ఖరీదైన చేతి గడియారాలు, 20కి పైగా విదేశీ మద్యం బాటిళ్లు లభించాయి. స్వాధీనం చేసుకున్న వాచీల మార్కెట్ విలువను అధికారులు ఆన్‌లైన్ ద్వారా పరిశీలిస్తున్నారు. వీటి అసలు ధర, కొనుగోలు వివరాలపై కూడా విచారణ కొనసాగుతోంది. ఇంట్లో వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్లు, ఇతర స్థిరాస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వా-ధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా ఆస్తుల విలువ, కొనుగోలు విధానం, ఆదాయ వనరులను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన పత్రాల ఆధారంగా భారీ మొత్తంలో ఆస్తులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. సోదాల్లో భాగంగా ముత్యం వెంకటరమణకు సంబంధించిన బ్యాంకు లాకర్లు కూడా గుర్తించినట్లు సమాచారం. వాటిని తెరిచి పరిశీలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లాకర్లలో లభించే నగదు, బంగారం లేదా ఇతర విలువైన వస్తువుల ఆధారంగా కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ముత్యం వెంకటరమణ, ఆయన కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఇంట్లోనే ఉండగా.. వారికి ఇబ్బంది కలగకుండా అధికారులు ప్రత్యేక గదిలో ఉంచి విచారణ నిర్వహిస్తున్నారు. వారి నుంచి ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. సోదాలు సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉందని, తనిఖీలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారికంగా వెల్లడించే అవకాశముంది.

# బియ్యం కోటా భారీ పెంపు.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర రైతుల సంక్షేమాన్ని , ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం నుంచి బియ్యం సేకరణ లక్ష్యాన్ని గతంలో ఉన్న 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి ఏకంగా 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ ఆమోదం తెలిపింది. అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించాలని కేంద్రం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రైతుల మేలు కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి గాను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి.. ప్రధాని నరేంద్ర మోదీకి , కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఈ బియ్యం కోటాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా , సమర్థవంతంగా వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. గత సీజన్లలో భారత ఆహార సంస్థ కి బియ్యం అప్పగించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించిన ఆయన, ఈసారైనా నిర్దేశించిన గడువులోగా పెంచిన సేకరణ కోటాను పూర్తి చేసి ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణ రైతులకు ఎంతో మేలు చేకూరడమే కాకుండా, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కూడా మరింత వేగవంతంగా సాగుతుందని భావిస్తున్నారు.

# ఇది ట్రైలర్ మాత్రమే

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా సాగుతున్న సీజేపీ నిరసనలు, ఉద్రిక్తతలు, హింసపై సీజేపీ జాతీయ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థి, యువజన ఉద్యమం స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పోరాటంగా రూపుదిద్దుకుంటోందని అశుతోష్ రంకా వ్యాఖ్యానించారు. ఈ నెల 20న జరిగిన నిరసన కేవలం ఒక 'ట్రైలర్' మాత్రమేనని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది య-ువకులు ఢిల్లీకి తరలివస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యువత ఆగ్రహానికి గురికాక ముందు ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు. గత 31 రోజులుగా గాంధీ, అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, అయితే పోలీసులు దౌర్జన్యంగా దాడులు చేసి విద్యార్థులను కొట్టడం వల్లే ఆందోళనల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొందని ఆయన ఆరోపించారు. నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకునే వరకు తమ ఆందోళన విరమించేది లేదని సీజేపీ నేత అభిజీత్ దీప్కే స్పష్టం చేసినట్లు తెలిపారు. తాము యుఎపిఎ , ఎన్ఎస్ఎ వంటి కఠిన చట్టాల కింద అరెస్టు కావడానికి, జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్ సమంజసమైనదని, సిద్ధాంతాలతో సంబంధం లేకుండా రాజకీయ పార్టీలు ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని అశుతోష్ రంకా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**ఇష్టమొచ్చిన నినాదాలు చేయొద్దు..**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా సాగుతున్న విద్యార్థుల ఆందోళనలో భాగంగా వివిధ సంఘాల నేతలు చేస్తున్న నినాదాలు తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నాయి. దీంతో అప్రమ-త్తం అయిన సీజేపీ నేతలు ఎలాంటి దేశ వ్యతిరేక, వివాదాస్పద నినాదాలు, వ్యాఖ్యలకు తావివ్వకూడదని అధికార ప్రతినిధి అశుతోష్ రంకా నిరసనకారులకు స్పష్టమైన పిలుపునిచ్చారు. తమ శాంతియుత పోరాటం పై ప్రతికూల ముద్ర వేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందువల్ల ఆందోళనకారులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. నిరసన ప్రదర్శన లో పాల్గొంటున్న వారంతా కేవలం నాలుగు ప్రధాన నినాదాలకే కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. 'భారత్ మాతా కీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'జై భీమ్', 'ధర్మేంద్ర ప్రధాన్ ఇస్తీఫా దో' (ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి) అనే నినాదాలు మాత్రమే చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇతర ప్రతికూల, అవాంఛనీయ నినాదాలను తాము సహించేది లేదని, లక్ష్యసాధన దిశగా క్రమశిక్షణతో పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా నిరసన కారులకు వెల్లడించారు.

**నడ్డానే జంతర్ మంతర్‌కు వచ్చి చర్చించాలి..**

కేంద్రంతో చర్చలకు మేము సిద్ధమేనని సీజేపీ పార్టీ మరోసారి స్పష్టం చేసింది. అయితే చర్చల కోసం తాము ఎవరి ఇంటికి వెళ్లబోమని తెలిపింది. ఈ మేరకు ఇవాళ కాక్రోచ్ జనతా పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ.. రెండో విడత చర్చల కోసం ఇవాళ ఉదయం పోలీసులు మళ్లీ మమ్మల్ని సంప్రదించారని చెప్పారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా మీతో మాట్లాడాలనుకుంటున్నారని చెప్పి ఆయన నివాసానికి రమ్మని ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ ఈ ఆహ్వానాన్ని తాము స్పష్టంగా తిరస్కరించినట్లు సౌరవ్ దాస్ వెల్లడించారు. మేము ఎవరి ఇంటికి, ఆఫీస్‌కు వెళ్లేదే లేదని.. కేంద్ర మంత్రులు, ప్రభుత్వం మాతో చర్చలు జరపాలంటే ఇకపై జంతర్ మంతర్ వద్దకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక్కడ జనతా దర్బార్ జరుగుతోందని ప్రజల ముందుకు వచ్చి చర్చలు జరపాలన్నారు.

**తటస్థ వేదిక అయినా వస్తాం:**

ఈ సందర్భంగా మాట్లాడిన సౌరవ్ దాస్ తాము చదువుకున్న వ్యక్తులమేనని తాము పట్టుదలకు పోయే వ్యక్తులం కాదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు చర్చల కోసం జంతర్ మంతర్ వద్దకు వస్తే తమ భద్రతపై ఏదైనా ఆందోళన ఉంటే జంతర్ మంతర్ సమీపంలోని ఏదైనా తటస్థ (న్యూట్రల్) వేదికగా సమావేశమయ్యేందుకు మేము సిద్ధమేనన్నారు. ఈ విషయంలో కేంద్రం సమాధానం కోసం వేచి చూస్తున్నామని వెల్లడించారు. అలాగే మా డిమాండ్లను ఆమోదించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉండాలని అర్థం లేని చర్చల కోసం మమ్మల్ని పిలవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మా సమయం చాలా విలువైనది. వేలాది మంది ప్రజలు ఇప్పటికీ ఈ నిరసనలో పాల్గొంటున్నారు, వారిని సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపై ఉందని తెలిపారు. .ప్రభుత్వం నిజంగా మాతో చర్చలు జరిపే ఉద్దేశంతో ఉందో లేదో ముందుగా స్పష్టం చేయాలని సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

# ఢిల్లీ హైకోర్టు సెన్సేషనల్ ఆర్డర్స్

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'సంసద్ చలో' నిరసన ప్రదర్శనలో విద్యార్థులను ఢిల్లీ పోలీసులు ఇష్టానుసారంగా చేయిచేసుకున్నారని దాఖలైన పిల్‌పై ఇవాళ ఢిల్లీ హైకోర్టు ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై పోలీసుల సమాధానాన్ని కోరుతూ.. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, రికార్డులను ఎస్ఓపీ ప్రకారం భద్రపరచాలని పోలీసులను ఆదేశించింది.

**వాడీవేడిగా వాదనలు..**

అయితే, పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదిస్తూ.. నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు విసిరారని, ఆందోళన హింసాత్మకంగా మారడంతోనే వారు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అనేకమంది పోలీసులకు గాయాలయ్యాయని, ప్రభుత్వం వాహనాలు కూడా పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయని కోర్టుకు విన్నవించారు. కేవలం పబ్లిసిటీ కోసమే ఇలాంటి తప్పుడు పిటిషన్లు దాఖలు చేశారని, నిజమైన ఫిర్యాదు ఉంటే బాధితులు సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించవచ్చని ఎస్‌రాజ్ కోర్టులో బలమైన వాదనలు వినిపించారు.

**ధర్మాసనం రియాక్షన్ ఇదే..**

వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది ఏదో ఒక వ్యక్తిగత ఘటన కాదని, గుంపును చెదరగొట్టేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ఆధారంగా పబ్లిక్ లా పరిధిలో బాధితులు ఊరట పొందవచ్చని స్పష్టం చేసింది. సీసీటీవీ దృశ్యాలను పూర్తిగా చూడకుండా తాము ఏ నిర్ణయానికీ రాలేమని, ఈ విషయంలో పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను నిరసన స్థలం నుంచి బలవంతంగా ఆస్పత్రి తరలించడంపై దాఖలైన పిటిష-న్‌ను కూడా ఇదే పిటిషన్లతో కలిపి విచారిస్తామని ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం పేర్కొన్నది.

# రాహుల్ గాంధీ అరెస్టు మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ ఖమ్మం రూ-రల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ నాయుడుపేట బైపాస్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పి. అనిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్య అని విమర్శించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేయడం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొంటూ, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగం చేయడం సరికాదని అన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, రవి, వీరారెడ్డి, పంతులు, కొప్పుల చంద్రశేఖర్, వీరెల్లి అప్పారావు, వర్గాని శ్రీను, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై ఇవాళ తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ మేరకు కేసులో తదుపరి విచారణను ఆగస్ట్ 12కు వాయిదా వేస్తున్నట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ మేరకు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాలు, ఆదేశాలకు సంబంధించిన రికార్డులను స్పీకర్ కార్యాలయం ఇప్పటివరకు తమకు సమర్పించలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, దీనిపై రియాక్ట్ అయిన స్పీకర్ ట్రైబ్యునల్ తరఫు న్యాయవాది, సదరు నిర్ణయాల రికార్డులను కోర్టుకు సమర్పించేందుకు తమకు మరికొంత సమయం కావాలని రిక్వెస్ట్




చేశారు. ఇరువైపుల పక్షాల వాదనలను విన్న కోర్టు.. రికార్డులు దాఖలు చేయడానికి స్పీకర్ ట్రైబ్యునల్‌కు గడువు మంజూరు చేస్తూ, తదుపరి విచారణను ఆగస్ట్ 12కు వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించింది.

# ప్రేమపేరుతో మోసం..

## ముఖం చాటేస్తున్న యువజన నాయకుడు

**పర్వతగిరి,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలానికి చెందిన ఓ య-ువతి, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఆరోపిస్తూ పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు సమర్పించిన ఫిర్యాదు ప్రకారం, తమ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు గత కొంతకాలంగా ప్రేమపేరుతో సన్నిహితంగా ఉంటూ వివాహం చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకొని పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడని పేర్కొంది. ఆ నమ్మకంతో తమ మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడిందని, అనంతరం యువకుడు మాట మార్చి వివాహానికి నిరాకరించడంతో పాటు స్థానిక నేతలు వారి పేర్లు చెబుతూ అవమానకరంగా మాట్లాడి, బెదిరింపులకు కూడా పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరిగినప్పటికీ ఫలితం లేకపోయిందని, తనను అవమానించిన మరికొందరిపైనా చర్యలు తీసుకోవాలని



ఫిర్యాదులో కోరినట్లు తెలిసింది. ప్రేమపేరుతో నమ్మించి మోసం చేసి, వివాహానికి నిరాకరించడం వల్ల తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్న బాధితురాలు, సంబంధిత వ్యక్తుల పై చట్టపరమైన కేసునమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరింది.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# నరేందర్, ధర్మేందర్ కలిసి లూటీ

**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై(ఎస్ఐఆర్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉంది' అని అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే ఎస్ఐఆర్ లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి దన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**నరేందర్, ధర్మేందర్ కలిసి లూటీ**

ప్రధాని నరేందర్, కేంద్ర మంత్రి ధర్మేందర్ కలిసి ఈ దేశాన్ని లూటీ చేస్తున్నారని లక్షలాది మది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుంటే ఈ దేశం చూస్తూ కూర్చోదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నాపత్రాలను పల్లీబఠానీల్లా అమ్ముకున్నారని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని లేకుంటే సడక్ టు సంసద్ పోరాటం తప్పదన్నారు. ఈ పోరాటాన్ని తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కొడంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంలో తప్పు చేసిన నిందితులను జైల్లో పెట్టాల్సింది పోయి, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు దారుణంగా లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం పాశవిక చర్య అని మండిపడ్డారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఆడపిల్లల దుస్తులు చింపేసి, వారిపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గాంధీ వారసులు, గాడ్సే వారసులకు మధ్య పోరాటం:**

పార్లమెంట్‌లో నీట్ అక్రమాలపై చర్చకు పట్టుబడితే ఉభయసభలను వాయిదా వేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇవాళ జరుగుతున్న పోరాటం కేవలం కాంగ్రెస్, బీజేపీ మధ్య కాదని గాంధీ వారసులకు, గాడ్సే వారసులకు మధ్య జరుగుతున్న యుద్ధం అని స్పష్టం చేశారు. దేశం కోసం ఇందిరా గాంధీ కుటుంబం ఎంతో రక్తం చిందించిందని, రాజీవ్ గాంధీ చివరి రక్తం బొట్టు వరకు దేశం కోసమే జీవించారని సీఎం అన్నారు. సోనియా గాంధీ ప్రధాని పదవినే త్యాగం చేశారని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీపై పోలీసులు దాడి చేస్తే రక్తాలు కారాయని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదన్నారు.

**నాడు బీఆర్ఎస్ నేడు బీజేపీ:**

గతంలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్లోబరీనా అనే సంస్థ ఇంటర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని సీఎం ఆరోపించారు. నాడు ఆ సంస్థ చేసిన పొరపాటు వల్ల అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఇప్పుడు అదే సంస్థ కేంద్రంలోని సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో కూడా పొరపాట్లు చేసిందన్నారు. ఈ తప్పిదాలతో అనేకమంది విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడ్డారని దేశంలో ఏ పరీక్ష జరిగినా దాని వెనుక ఒక కుంభకోణం ఉంటోందని ధ్వజమెత్తారు.



## విద్యార్థుల కలలు ఛిద్రమయ్యాయి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల కలలు ఛిద్రమయ్యాయి. వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలగాలను ప్రయోగించడం అత్యంత దురదృష్టకరం. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి గారు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారు, రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన నిరసనలకు మద్దతుగా నిలిచిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా గారిని మరియు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాహుల్ గాంధీ గారు, ప్రియాంక గాంధీ గారు మరియు విద్యార్థులకు గాయాలయ్యేవిధంగా.. రక్తసిక్తమైన అరెస్టు తీరుపై నిరసనగా ఈ రోజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో లోక్ భవన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర ఉన్నమాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహచర మంత్రులు దామోదర రాజనర్సింహా గారు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ గారు, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ గారు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్ గారు, నవీన్ కుమార్ యాదవ్ గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున ఎన్ ఎస్ యు విద్యార్థులు, వేలాదిమంది కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టి, చేతులకు సంకెళ్ళ వేసుకుని నిరసన వ్యక్తం చేయడం జరిగింది .అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, నినాదాలు చేస్తూ చలో లోక భవన్ కు భారీ ర్యాలీగా బయలుదేరి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించడం జరిగింది. ప్రజలు, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అణచివేయడానికి అరెస్టులను ఆయుధంగా ఉపయోగించడం సిగ్గు చేటు. ఇప్పటికైనా పార్లమెంటులో నీట్ పేపర్ లీకేజీపై చర్చ జరపాలి, విద్యార్థుల గొంతును వినిపించే ప్రతిపక్షాలకు సభలో చర్చకు అవకాశం ఇవ్వాలి. సమగ్ర విచారణకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారు వెంటనే రాజీనామా చేయాలి.

# కాంగ్రెస్ ధర్నాలు రాజకీయ డ్రామాలే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ధర్నాలను రాజకీయ డ్రామాలు అంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్‌ను అసలు ప్రతిపక్షంగానే ప్రజలు గుర్తించడం లేదని, కేవలం రాజకీయ నాటకాలతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. సీజేపీ (కాక్రోచ్ పార్టీ)తో పోటీ పడేందుకే కాంగ్రెస్ ఇటువంటి ధర్నాలకు దిగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. రాహుల్ గాంధీ బీజేపీకి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం బీజేపీకే లాభమని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీపై తాము దౌర్జన్యం చేయాల్సిన అవసరం లేదని, ప్రధాని నివాసం ముందు ధర్నా పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని స్పష్టం చేశారు. నీట్ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ డ్రామాలు ఆపి చర్చకు రావాలని సవాల్ విసిరారు. మరోవైపు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చేస్తున్న ధర్నాలు పెద్ద జోక్ అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని అని రేవంత్ అనడం విడ్డూరంగా ఉందన్న ఆయన, రాహుల్ ప్రధాని కావడం దేవుడెరుగు.. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కూడా కల అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పొలాల్లో నారు ఎండిపోయి, ఎరువులు అందక రైతులు అల్లాడుతుంటే సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ఫెయిల్ కావడంతో ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ సర్కార్ ఈ నిరసన డ్రామాలకు తెరదీసిందని ఆరోపించారు. ఇకనైనా ఆందోళనలు ఆపి, రైతుల పంటలకు సాగునీరందించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# రాజ్యాంగాన్ని అవమానించడమే..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద నీట్ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై జరిగిన పోలీస్ దమనకాండను నిరసిస్తూ ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.



# భారత విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది..

**న్యూ ఢిల్లీ :** నీట్ అక్రమాలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ శాంతియుతంగా చేపట్టిన 'సంసద్ చలో' నిరసన ప్రదర్శనలో విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన దమనకాండపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ ఢిల్లీలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై, పోలీసుల వైఖరిపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దాడికి సంబంధించిన వీడియో దృశ్యాలను రాహుల్ గాంధీ మీడియా వేదికగా ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల విషయంలో అసలు ఈ దేశంలో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుకోవడం తప్పా..? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఈ స్థాయిలో లాఠీఛార్జ్ చేయడం హేయమైన చర్య కాదా.. అని మండిపడ్డారు.

**152 పేపర్లు లీక్.. 7.5 కోట్ల మందిపై ప్రభావం**

దేశంలో అసలు సరైన విద్యా వ్యవస్థే లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 152 ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, దీనివల్ల దాదాపు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతిందని ధ్వజమెత్తారు. భారత విద్యావిధానాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎన్డీఏ పాలనలో మధ్యతరగతి కుటుంబాలకు విద్య అనేది అత్యంత భారంగా మారిందని, విద్యార్థుల ఆవేదనను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఎద్దేవా చేశారు. 'నీట్' పరీక్షల నిర్వహణ కోసం రూ. 1.52 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, పరీక్షల నిర్వహణలో అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టి విద్యా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**పరీక్షల్లో పారదర్శకత లేకపోతే ఎలా?**

ఇక నీట్ రాసే ఒక్కో విద్యార్థికి ఏడాదకి రూ. 1.32 లక్షల ఖర్చు అవుతోందని రాహుల్ గాంధీ అన్నారు. పైగా దేశ యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయని.. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలు నాశనం చేస్తున్నారని కేంద్రంపై ఆయన మండిపడ్డారు. మరోవైపు దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగిందని.. మన పరిశ్రమలు మూతపడుతున్నాయని కామెంట్ చేశారు. బ్యాంకులను బాడా వ్యాపారులు లూటీ చేస్తున్నారని, ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలోని ఉద్యోగాలు కూడా గల్లంతవుతున్నాయని అన్నారు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య విద్యార్థులు రాసే పరీక్షల్లో పారదర్శకత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యా శాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా ఫెయిల్ అయ్యారని, ఆయన రాజీనామా చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరకుకుంటుందని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు ప్రధాని మోడీ బహిరంగ క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ అన్నారు.

**పార్లమెంట్‌లో నల్ల దుస్తుల్లో ప్రతిపక్ష ఎంపీల నిరసన**

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులపై జరుగుతున్న దౌర్జన్యాలకు, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్ష (ఇండియా కూటమి) ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్ష నేతలందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా మీడియా తో మాట్లాడుతూ.. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా తామంతా నల్ల దుస్తులు ధరించామని తెలిపారు. దేశంలోని విద్యార్థులపై అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకపోవడం, విమర్శలు వెల్లువెత్తుతున్నా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవిలో కొనసాగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈ సందర్భంగా ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# ప్రజల అవసరాలే లక్ష్యంగా

**అమీన్ పూర్,ఫ్లాష్ ఇండియా :** అమీన్‌పూర్ ప్రాంతాన్ని సమగ్ర ప్రణాళికతో శరవేగంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. అమీన్‌పూర్ సర్కిల్-47 పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 16.53 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు బుధవారం టీజీఐఐసీ ఛైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి,స్థానిక ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తోందని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి బీరంగూడతో పాటు అమీన్‌పూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు, స్మశానవాటిక అభివృద్ధి వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకటస్వామి బీరంగూడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.

**బీరంగూడ అభివృద్ధికి రూ.9.03 కోట్ల మంజూరు పై కృతజ్ఞతలు : శశిధర్ రెడ్డి.**

అమీన్‌పూర్ సర్కిల్-47 పరిధిలో మంజూరైన రూ. 16.53 కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా బీరంగూడ ప్రాంతానికి రూ. 9.03 కోట్ల నిధులు కేటాయించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి దామోదర రాజనర్సింహ, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో బీరంగూడను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సహకరించిన మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి,కాటా శ్రీనివాస్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీజీఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి డీసీ ప్రదీప్ కుమార్, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాహుల్ గాంధీ అరెస్టు నిరసిస్తూ బీరంగూడలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన**

విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసనగా ఢిల్లీలో ప్రధాని నివాసాన్ని ముట్టడించే కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బీరంగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని గుట్ట కమాన్ వద్ద అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేయడానికి ప్రయత్నించిన కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకొని స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# సంపాదకీయం

## ప్రశ్నిస్తే “వ్యతిరేక మీడియా”




ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించడం పౌరుడి హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. కానీ నేటి రాజకీయ వాతావరణాన్ని గమనిస్తే, ఈ ప్రాథమిక సూత్రం నెమ్మదిగా మారిపోతోందనే భావన కలుగుతోంది. అధికారాన్ని ప్రశ్నించే వారిని ప్రత్యర్థులుగా, విమర్శించే వారిని శత్రువులుగా, వాస్తవాలను అడిగే వారిని అభివృద్ధికి అడ్డంకులుగా చిత్రీకరించే ధోరణి బలపడుతోంది. ప్రజాస్వామ్య చర్చల స్థానంలో వ్యక్తిపూజ, విధానాల స్థానంలో ప్రచారం, జవాబుదారీతనం స్థానంలో అంధ విశ్వాసం పెరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినిపిస్తున్న ఒకే ఒక్క సందేశం “ప్రశ్నించొద్దు... భక్తుడిగా ఉండాలి!”రాజకీయాల్లో ప్రజాదరణ సహజం. నాయకులపై అభిమానమూ సహజమే. కానీ అభిమానం అంధభక్తిగా మారినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఒక నాయకుడు, ఒక పార్టీ లేదా ఒక ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయం సరైనదేనని నమ్మడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. ప్రజాస్వామ్యంలో ఏ నాయకుడూ ప్రశ్నలకు అతీతుడు కాదు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబు చెప్పాల్సిందే.ఈ రోజుల్లో ఎన్నికల ప్రచారాలు అభివృద్ధి, ఉపాధి, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి అసలు సమస్యల చుట్టూ తిరగడం కంటే, వ్యక్తుల చుట్టూ ఎక్కువగా తిరుగుతున్నాయి. రాజకీయ చర్చల్లో గణాంకాల కంటే నినాదాలు, వాస్తవాల కంటే ప్రచార చిత్రాలు, విధానాల కంటే వ్యక్తిగత విధేయతకు అధిక ప్రాధాన్యం లభిస్తోంది. ఫలితంగా రాజకీయ పార్టీలు కూడా కార్యకర్తల కంటే భక్తులను తయారు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఏ ప్రభుత్వమైనా ప్రజా ధనంతోనే పాలన సాగిస్తుంది. ప్రజల పన్నులతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. కాబట్టి ఆ నిధులు ఎలా ఖర్చవుతున్నాయి? ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ఉద్యోగాల పరిస్థితి ఏమిటి? అప్పుల భారం ఎంత పెరిగింది? సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత ఉందా? అనే ప్రశ్నలు అడగడం ప్రతి పౌరుడి హక్కు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ ప్రశ్నలను రాజకీయ ద్వేషంగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు.ఇటీవలి కాలంలో మరో ప్రమాదకర ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. అధికారాన్ని ప్రశ్నించిన వ్యక్తిపై వ్యక్తిగత దాడులు చేయడం, సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడం, అతని ఉద్దేశాలను అనుమానించడం సాధారణంగా మారిపోయింది. ఒక విధానాన్ని విమర్శించినా, అది దేశాన్ని లేదా రాష్ట్రాన్ని విమర్శించినట్టుగా ప్రచారం జరుగుతోంది. నాయకుడిని ప్రశ్నిస్తే ప్రజలను ప్రశ్నించినట్టుగా, ప్రభుత్వాన్ని విమర్శిస్తే అభివృద్ధిని వ్యతిరేకించినట్టుగా భావించే వాతావరణం ఏర్పడుతోంది. ఇది ప్రజాస్వామ్యాన్ని బలపరచదు; బలహీనపరుస్తుంది.ప్రతిపక్ష పార్టీల పాత్ర కూడా ఇక్కడే కీలకం. అధికారాన్ని ప్రశ్నించడం వారి రాజ్యాంగబద్ధమైన బాధ్యత. అదే సమయంలో ప్రతిపక్షం చేసే ప్రతి విమర్శను రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కూడా సరైన పద్ధతి కాదు. ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, ప్రతిపక్షం, మీడియా, పౌర సమాజం -- ఈ నాలుగు వ్యవస్థలు పరస్పరం ఒకదానిని మరొకటి పరిశీలిస్తూ, సమతుల్యతను కాపాడాలి. ఒక వ్యవస్థ మిగతా వ్యవస్థలను పూర్తిగా అణచివేయాలనుకుంటే, ప్రజాస్వామ్య ఆత్మ దెబ్బతింటుంది.మీడియా పాత్ర కూడా ఈ సందర్భంలో అత్యంత ముఖ్యమైనది. అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజల తరఫున జవాబులు రాబట్టడం మీడియా ప్రధాన బాధ్యత. అయితే మీడియాను కూడా అనుకూలం, ప్రతికూలం అనే రెండు శిబిరాలుగా విభజించి చూడటం పెరుగుతోంది. అధికారాన్ని ప్రశ్నిస్తే “వ్యతిరేక మీడియా”, ప్రశంసిస్తే “జాతీయవాద మీడియా” అనే ముద్రలు వేయడం ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించే ప్రక్రియను దెబ్బతీస్తోంది. మీడియా స్వేచ్ఛ బలహీనపడితే, చివరికి నష్టపోయేది ప్రజలే.సామాజిక మాధ్యమాల ప్రభావంతో రాజకీయ భక్తి మరింత వేగంగా వ్యాపిస్తోంది. ఒక పోస్టు, ఒక వీడియో, ఒక ప్రసంగం చుట్టూ వాస్తవాల కంటే భావోద్వేగాలే ఎక్కువగా ప్రచారం అవుతున్నాయి. ప్రశ్నలు అడిగే వారి కంటే ప్రశంసలు చేసే వారికే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. అల్గోరిథంలు కూడా విభేదాల కంటే విధేయతను ప్రోత్సహించే పరిస్థితులు సృష్టిస్తున్నాయి. ఫలితంగా రాజకీయ చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా, అభిమానాల ఆధారంగా సాగుతున్నాయి.చరిత్ర చెబుతున్న ఒక స్పష్టమైన సత్యం ఏమిటంటే... ప్రశ్నలను స్వీకరించిన ప్రభుత్వాలు మరింత బలపడ్డాయి. విమర్శలను వినిన నాయకులు కాలపరీక్షలో నిలిచారు. ప్రశ్నలను అణచివేయడానికి ప్రయత్నించిన వ్యవస్థలు మాత్రం చివరకు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే పాలనపై నమ్మకం పెరుగుతుంది. భయంతో వచ్చే మౌనం తాత్కాలికం మాత్రమే; విశ్వాసంతో వచ్చే మద్దతు శాశ్వతం.ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం ఒక్కరోజు బాధ్యత. కానీ ప్రశ్నించడం ఐదేళ్ల బాధ్యత. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులను, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై నిలదీయడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియ. ప్రశ్నించే పౌరుడే నిజమైన ప్రజాస్వామ్య రక్షకుడు. భక్తుడిగా మారిన పౌరుడు తన హక్కులను స్వయంగా వదులుకుంటాడు.ఇది ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క నాయకుడికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. అధికారంలో ఎవరు ఉన్నా, ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా ఒకే ప్రమాణం ఉండాలి. నిన్న ప్రశ్నించినవారు ఈ రోజు అధికారంలోకి వచ్చాక ప్రశ్నలను సహించాలి. నేడు ప్రశ్నలను అడ్డుకునే వారు రేపు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే ప్రశ్నించే హక్కును కోరుతారు. అందుకే ప్రజాస్వామ్య విలువలు వ్యక్తుల కంటే గొప్పవి, పార్టీల కంటే శాశ్వతమైనవి.ప్రజాస్వామ్యానికి కావాల్సింది భక్తుల సైన్యం కాదు; ఆలోచించే పౌరుల సమాజం. ప్రభుత్వానికి అవసరమైంది చప్పట్లు కొట్టే చేతులు మాత్రమే కాదు; లోపాలను చూపించే గొంతులు కూడా. అధికారాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. వాస్తవాలను అడగడం అభివృద్ధికి అడ్డంకి కాదు. అవే మెరుగైన పాలనకు పునాది.అందుకే ప్రతి ఎన్నిక తర్వాత, ప్రతి బడ్జెట్ తర్వాత, ప్రతి హామీ తర్వాత, ప్రతి నిర్ణయం తర్వాత ప్రజలు అడగాల్సిన ప్రశ్న ఒక్కటే “ఏం చెప్పారు? ఏం చేశారు?” ఆ ప్రశ్న వినిపిస్తూనే ఉన్నంత వరకు ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. ఆ ప్రశ్నే ఆగిపోతే, ప్రజాస్వామ్యం రూపంలో ఉన్నా, ఆత్మలో మాత్రం భక్తి రాజ్యం మొదలవుతుంది.ప్రజాస్వామ్యంలో నాయకులకు భక్తులు అవసరం కావచ్చు. కానీ దేశానికి అవసరమయ్యేది ప్రశ్నించే పౌరులు. ప్రశ్నలు బలహీనతకు గుర్తు కాదు; అవే స్వేచ్ఛకు, జవాబుదారీతనానికి, నిజమైన ప్రజాస్వామ్యానికి జీవం పోసే శక్తి.




## రాజీవ్ యువ వికాసంపై నీలినీడలు

నిరుద్యోగ యువత కు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టి న రాజీవ్ యువ వికాస పథకం అటకెక్కినట్టేనా? రెండేళ్ల క్రితం ఈ పథకం తెరమీదికి వచ్చింది. యూనిట్ల మంజూరీ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు ప్రస్తుతం అతీగతీ లేకుండా పోయాయి. దరఖాస్తుదారులు రుణాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. దీని గురించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు.దరఖాస్తుదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ పథకం విషయంలో అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో ఏమీ చెప్పలేక పోతున్నారు. ప్రభుత్వం మొదట్లో రాజీవ్ యువ వికాస పథకం గురించి గొప్పగా ప్రచారం చేసింది. నిరుద్యోగ యువతకు లేనిపోని ఆశలు కల్పించింది. 2025 జూన్ 2 నుంచి అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యువత నుంచి దరఖాస్తులను స్వీకరించింది. మంజూరైన యూనిట్ల మేరకు పత్రాలను అర్హులకు పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. చివరి క్షణంలో రుణాల పంపిణీ వాయిదా పడింది. తాజాగా తిరిగి ప్రభుత్వం ఈ పథకంపై ఆశలు రేపడంతో యువత ఎదురుచూస్తోంది.

**పరిశీలన పూర్తి..**

గ్రామ, పట్టణ స్థాయిలో మంజూరైన యూనిట్ల కోసం పురపాలక, మండల స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాయి. కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు ప్రత్యేకాధికారులు, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. 2026-27 బడ్జెట్‌లోనూ మరోసారి ఈ పథకానికి రూ.6వేల కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో ఈ సారైనా నిధులను విడుదల చేస్తారా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

**ఐదు రకాల యూనిట్లు**

రాజీవ్ యువ వికాస పథకం కింద వివిధ యూనిట్లకు ఇచ్చే సబ్సిడీ రుణ మొత్తాన్ని ఐదు రకాల యూనిట్ల కింద రాష్ట్ర ప్రభు త్వం విభజించింది. కేవలం రూ.50వేల యూనిట్‌కు మాత్రమే నూరు శాతం సబ్సిడీతో అందించనున్నట్టు తెలిపింది. ఆపైన అంటే రూ.లక్ష యూనిట్‌లో రూ.90వేలు ప్రభుత్వం, రూ.10వేల ను రుణంగా, రూ.2 లక్షల యూనిట్‌లో రూ.1.60 లక్షలను ప్రభు త్వం, మిగతా రూ.40 వేలను బ్యాంకు రుణంగా, రూ.3 లక్షల యూనిట్‌లో రూ.2.10 లక్షలను ప్రభుత్వం, మిగతా రూ.90వేల ను బ్యాంకు రుణంగా, రూ.4లక్షల యూనిట్‌లో రూ.2.80 లక్షల ను ప్రభుత్వం, మిగతా రూ.1.20 లక్షలను బ్యాంకు రుణంగా అందివ్వాలని నిర్ణయించింది.

**దరఖాస్తులు ఉన్నాయా?**

ప్రతీ నియోజకవర్గంలో ఏటా 5వేల మందికి రుణాలు మం జూరు చేస్తామని, ఈ పథకం కింద రూ.6వేల కోట్లు కేటాయిస్తున్నామని అసెంబ్లీ వేదికగా అట్టహాసంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత చేతులెత్తేయడంతో ఈ పథకం అమలుపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. గత సంవత్సరం జూన్ 2వ తేదీన రాష్ట్రావిర్భావ వేడుకల సందర్భంగా ఆ రుణాలను పంపిణీ చేస్తామని కూడా ఊదరగొట్టింది. ఈ ఏడాది జూన్ 2 దాటినా ఏ ఒక్కరికీ పైసా ఇవ్వలేకపోయింది. అసలు యువతీ యువకుల నుంచి ఏడాదిన్నర క్రితం తీసుకున్న దరఖాస్తులు ఉన్నాయా? లేదా? అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది.

**షెడ్యూల్ ప్రకటించి..**

రుణాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి ఐదు విడతల్లో రుణాలను మంజూరు చేస్తామని ప్రభుత్వం షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. 2025 జూన్‌లో రూ.50వేల నుంచి రూ.లక్ష యూ నిట్లనను ఒక లక్ష మందికి, జూలైలో రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల యూనిట్లను ఒక లక్ష మందికి, ఆగస్టులో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల యూనిట్లను మరో లక్ష మందికి, సెప్టెంబరులో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లను ఇంకో లక్ష మందికి, అక్టోబరులో రూ.4 లక్షల యూనిట్లను మరో లక్ష మందికి అందించనున్నట్టు ప్రకటించింది. ఇదంతా నిజమేనని నమ్మి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులు రుణాలు ఎప్పుడు ఇస్తారో తెలియక త్రిశంకు స్వర్గం లో కొట్టుమిట్టాడుతున్నారు.

**1.85 లక్షల దరఖాస్తులు**

రాజీవ్ యువ వికాస పథకం కింద వివిధ కేటగిరీల కింద ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,85,730 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిలో రూ.50వేల లోపు యూనిట్ రుణం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత నుంచి 28,496 రూ.లక్ష పైనా రూ.2 లక్షల వరకు యూనిట్ కోసం 49,716, రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు యూనిట్ కోసం 55,602, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్ కోసం రుణానికి 51,936 దరఖాస్తులు వచ్చాయి. కాగా, రాజీవ్ యువ వికాసానికి సంబంధించి ఈ నెలలో ప్రభుత్వ ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాగానే ఉమ్మడి జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు రుణా లు అందించి స్వయం ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత అధికారుల చెబుతున్నారు.

**మార్గదర్శకాలు జారీ అయినా..**

అర్హుల ఎంపికకు 2025 ఫిబ్రవరిలోనే మార్గదర్శకాలను జారీ చేసింది. జనాభా దామాషా కేటగిరీల వారీగా యూనిట్లకు 2025, మే నెలలోగా అర్హులను మండల స్థాయి కమిటీలు ఎంపిక చేయాలని, ఆ జాబితాలను పంపితే ఆ జిల్లా కమిటీలు 31లోగా తుది జాబితాను సిద్ధం చేసి, ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను ప్రకటించాలని, 2025 జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించింది. కానీ, ఇప్పటికీ అర్హుల జాబితాల జాడే లేదు. ఇప్పటికైనా రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రుణంఇచ్చి ఆదుకోవాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

## మన కొలువులు ఎప్పుడు?

“మన నీళ్లు... మన నిధులు... మన కొలువులు.” తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ నినాదం ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచింది. ముఖ్యంగా “మన కొలువులు” అనే మాట వేలాది మంది నిరుద్యోగ యువతను ఉద్యమంలోకి తీసుకొచ్చింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, ఖాళీ ప్రభుత్వ పోస్టులు భర్తీ అవుతాయని, తమ భవిష్యత్తు మారుతుందని వారు విశ్వసించారు. ఆ ఆశయమే తెలంగాణ ఉద్యమానికి బలమైంది.రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా నిరుద్యోగ సమస్య ఇప్పటికీ ప్రధాన సవాలుగానే మిగిలింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తోంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఏటా రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇచ్చింది. గత ప్రభుత్వాన్ని ఉద్యోగాల విషయంలో తీవ్రంగా విమర్శిస్తూ, అధికారంలోకి వస్తే వేగంగా నియామకాలు చేపడతామని ప్రజలను నమ్మించింది.అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదనే విమర్శలు నిరుద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. సమగ్ర జాబ్ క్యాలెండర్ ఇంకా విడుదల కాలేదు. ఖాళీ పోస్టుల భర్తీపై స్పష్టమైన కాలపట్టిక లేదు. మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలులోకి రాలేదు. ఎన్నికల హామీలు ఒకవైపు, పాలనలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితి మరోవైపు ఉండటంతో యువతలో నిరాశ పెరుగుతోంది.ఇప్పటివరకు పూర్తైన కొన్ని నియామకాలు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రక్రియలే. వాటిని పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యతే. కానీ వాటినే కొత్త ప్రభుత్వ విజయంగా చెప్పుకోవడం కంటే, కొత్త నియామకాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉంది. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల పెంపు, కానిస్టేబుల్ నియామకాల విస్తరణ, వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ వంటి అంశాలపై ప్రభుత్వం మరింత చురుకుగా స్పందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.ఈ అంశంలో మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్యలపై తీవ్రంగా గళమెత్తిన కొందరు రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజా సంఘాలు ప్రస్తుతం అదే సమస్యపై మౌనం పాటిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా ప్రజల సమస్య మారలేదు. కాబట్టి ప్రశ్నించే స్వరం కూడా మారకూడదు. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని బట్టి ప్రమాణాలు మారితే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.అయితే ప్రభుత్వం ఎదుర్కొనే పరిపాలనా, ఆర్థిక సవాళ్లను కూడా విస్మరించలేం. కానీ ఆ కారణాలను ప్రజలకు పారదర్శకంగా వివరించడం ప్రభుత్వ బాధ్యత. ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఎప్పుడు నోటిఫికేషన్లు వస్తాయి? నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలి. మౌనం కంటే పారదర్శకత ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది.తెలంగాణ ఉద్యమం ఒక గొప్ప పాఠం నేర్పింది హక్కులు అడిగితేనే దక్కుతాయి. ఉద్యోగాల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం వ్యతిరేకత కాదు; ప్రజాస్వామ్య బాధ్యత. అదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత.”మన కొలువులు” అనే నినాదం ఉద్యమ చరిత్రలో మాత్రమే మిగిలిపోకూడదు. అది ప్రభుత్వ విధానాల్లో కనిపించాలి. తెలంగాణ యువతకు మరోసారి హామీలు కాదు... ఉద్యోగాలే సమాధానం.




సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# గ్రేటర్‌లో నకి'లీలలు'




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రేటర్ హైదరాబాద్‌లో పేరొందిన కంపెనీ ఉత్పత్తుల ను పోలిన నకిలీ ఉత్పత్తులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. టీ పొడి, నెయ్యి, పాలు, నూనెలు, కిరాణా వ స్తువులు, పప్పుదినుసులు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, విద్యుత్ పరికరాలు, టీవీ లు, కంప్యూటర్లు, మిక్సీలు, గ్రైండర్లు ఇలా ఒక్కటేమిటీ అన్ని రకాల నిత్యావసరాలను అచ్చు గుద్దినట్లు అసలు ను పోలిన నకిలీ వస్తువులను తయారు చేసి అమ్ముతూ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. పెద్ద కంపెనీల లేబుళ్లను ఎలాంటి అనుమతులు లే కుండా ఇల్లీగల్‌గా తాము తయారు చేసిన వస్తువులకు వేసి బహిరంగంగా అమ్ముతున్నారు. ఇది తెలియని కొనుగోలుదారులు అవే ఒరిజినల్ అ నుకొని కొని దారుణంగా మోసపోతున్నారు. ఇలాంటి అమ్మకాలకు ప్రముఖ వ్యాపార కేంద్రాలైన బేగంబజార్, ట్రూప్ బజార్, మహారాజ్ గంజ్, బ్యాంక్ స్ట్రీట్, గుజరాతీగల్లీ, రాణిగం జ్, జాంబాగ్ మార్కెట్లు అడ్డాలుగా మారుతున్నాయి. దాడులు చేసి డూప్లి కేట్ అమ్మకందార్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు సైతం వినబడుతున్నాయి. ఎప్పుడో ఒ కసారి తూతూ మంత్రంగా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటుండడం తో నకిలీల బెడద తప్పడం లేదని సా ధారణ ప్రజలు మండిపడుతున్నారు .

**హోల్ సేల్ మార్కెట్లలో అడ్డగోలు విక్రయాలు..?**

బేగంబజార్, మహారాజ్ గంజ్ మా ర్కెట్లకు అన్ని రకాల వస్తువులు విక్ర యించే హోల్ సేల్ మార్కెట్లుగా గు ర్తింపు పొందాయి. ఇక్కడ పెద్ద సం ఖ్యలో హోల్ సేల్ దుకాణాలు ఉండ గా జంటనగరాలతో పాటు జిల్లాల నుంచి కూడా కొనుగోలు కోసం వ స్తుంటారు. ప్రతినిత్యం కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయే మార్కెట్ల లో నిత్యం కోట్లాది రూపాయల విక్రయా లు జరుగుతుంటాయి. ఇంతటి పేరు న్న మార్కెట్లపై అధికారులు దాడులు మరచిపోవడంతో నిర్వాహకులు నకిలీ వస్తువుల విక్రయాలకు తెరలేపారు. ఈ నేపథ్యంలో అధికారులకు అందిన ఫిర్యాదులతో గతంలో మార్కెట్‌లోని కొన్ని హోల్ సేల్ దుకాణాలపై దాడు లు చేయగా విస్తుపోయే వాస్తవాలు వె లుగు చూశాయి. లక్షలాది రూపా యల నకిలీ గృహోపకరణాలు పట్టుబడడంతో అధికారులు సైతం షాక్ తిన్నారు .


**నిలువు దోపిడీ..?**

నకిలీ వస్తువులు విక్రయించే వ్యాపారులు ప్రజలను నిలువు దోపి డీ చేస్తున్నారు. పేరొందిన ఏ కంపెనీ బ్రాండ్ ల పేరుతో-నైనా నకిలీవి తయారు చేసి విక్రయించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ముఖ్యంగా బ్రాండ్ యజమాని అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా తయారు చేస్తూ నిత్యం లక్షలాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కంపెనీలు తయారు చేసిన అసలు వస్తువుల మాధిరిగానే పేర్లు, లేబుల్స్ ఉంటుండడంతో కొ నుగోలుదారులు వీటిని చూసి బో ల్తా పడుతున్నారు. దీనికితోడు నకి లీ వస్తువుల తయారీ, విక్రయదారు లు డిస్కౌంట్లు , ఆఫర్లు అంటూ మ భ్యపెడుతూ బహింరంగ విక్రయా లు చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నగరంలోని పేరొం దిన మార్కెట్లలోని హోల్ సేల్ దుకాణాలపై తరచుగా దాడులు చేసి నకిలీ ప్రొడక్ట్స్ అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలను నగర ప్రజలు వ్యక్తం చే స్తున్నారు

# డ్యూటీలో మొబైల్ వాడకం కుదరదు..!

## ట్రాఫిక్ పోలీసులకు కొత్త రూల్స్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసుల విధి నిర్వహణలో కీలక మార్పులు తీసుకురావాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. రోడ్లపై విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది, అధికారులు ఇకపై డ్యూటీ సమయంలో వ్యక్తిగత మొబైల్ ఫోన్లను వెంట తీసుకెళ్లకుండా కొత్త నిబంధన తీసుకురావాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో కొంతమంది ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో మొబైల్ ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటనలను ఉన్నతాధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. డ్యూటీలో ఉండగా మొబైల్‌పై దృష్టి పెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించే అవకాశం తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఎక్కువగా ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో విధి నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, అధికారిక సమాచార మార్పిడి కోసం కేవలం వీహెచ్ సెట్ల ద్వారానే కమ్యూనికేషన్ నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వీహెచ్ సెట్ల సిగ్నల్ సామర్థ్యాన్ని టెక్నాలజీ బృందాలు పరీక్షిస్తున్నాయి. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే రోడ్లపై విధులు నిర్వహించే ప్రతి ట్రాఫిక్ సిబ్బందికి వీహెచ్ సెట్ తప్పనిసరిగా అందించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ నిర్ణయానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. తుది ఆమోదం లభించిన తర్వాత కొత్త నిబంధనలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చర్యలతో ట్రాఫిక్ సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా మారే అవకాశం ఉంది. కాగా, విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు మొబైల్ ఫోన్లు వాడుతున్న ఘటనలు చాలా ఉన్నాయంటూ పోలీసు అధికారులకు ఫిర్యాదులు వెల్లాయట.. మరోవైపు.. కొందరు పోలీసులు.. తమ మొబైల్ కెమెరాల్లోనే.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారి ఫొటోలను తీస్తున్న ఘటనలు కూడా లేకపోలేదు.. అయితే, ఈ రూల్స్‌పై ట్రాఫిక్ పోలీసులు ఎలా స్పందిస్తారు అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది..





# ప్రభుత్వానికి కవిత డిమాండ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పని చేస్తున్న లక్షలాది మంది వర్కర్లు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. రోజంతా కష్టపడినా వారి ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని, మూడేళ్లుగా రేట్లు పెంచాలని వాళ్లు అడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. అగ్రిగేటర్ సంస్థలు కమీషన్ల కోత విధిస్తూ, ఛార్జీలను అన్యాయంగా నియంత్రిస్తున్నాయని, దీనివల్ల డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ తీవ్రమైన ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నార ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అగ్రిగేటర్స్ సంస్థలతో మాట్లాడి గిగ్ వర్కర్లకు, క్యాబ్ డ్రైవర్లకు ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ వీడియోను రిలీజ్ చేశారు.

**గిగ్ వర్కర్స్ పక్షాన నిలబడండి:**

రాష్ట్ర ప్రభుత్వం గిగ్ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పక్షాన నిలబడాలని కవిత డిమాండ్ చేశారు. రేట్ల విషయంలో అగ్రిగేటర్లు పట్టి పీడిస్తున్నారని ఈ విషయంలో గిగ్ వర్కర్లు గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గిగ్ వర్కర్లు అంతా ఇవాళ మధ్యాహ్నం వరకే బ్రేక్ డౌన్ చేస్తున్నారని ఇటువంటి ఉద్యమాలు చేసే పరిస్థితి లేకుండా గిగ్ వర్కర్లు, ఆటో క్యాబ్ డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని హెచ్చరించారు. గిగ్ వర్కర్ల ఉద్యమానికి టీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందన్నారు.



# హస్తినలో ఆగని ఆందోళనలు..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న యువత ఆందోళనల నేపథ్యంలో భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలోని 16 మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేసింది. ప్రయాణికులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, తాజా సమాచారం కోసం అధికారిక ప్రకటనలను అనుసరించాలని డీఎంఆర్సీ సూచించింది. భద్రతా కారణాలతో మూసివేసిన మెట్రో స్టేషన్లలో లోక్ కళ్యాణ్ మార్గ్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, బరాఖంబా రోడ్, సుప్రీంకోర్టు, సేవా తీర్థ్, జనపథ్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, ఐటీవో, ఢిల్లీ గేట్, ఇంద్రప్రస్థ, ఖాన్ మార్కెట్, జోర్ బాగ్, శివాజీ స్టేడియం ఉన్నాయి. ఇదిలా ఉండగా, జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలపై సుమోటోగా విచారణ చేపట్టాలని కోరంతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వీడియోలు లేదా సోషల్ మీడియాలో కనిపించే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సుమోటో చర్యలు తీసుకునేందుకు తమకు సమయం లేదని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. అలాగే, విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించలేదు. ఈ అంశంలో చట్టపరంగా అందుబాటులో ఉన్న ఇతర న్యాయ మార్గాలను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. మొత్తంగా ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనలు, భద్రతా ఏర్పాట్లు, న్యాయస్థానం తాజా నిర్ణయాలతో రాజధానిలో పరిస్థితులు ఉద్రిక్తంగా కొనసాగుతున్నాయి. అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు..

# సీజేపీకి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ..



**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. "మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు, అంత సమయం కూడా లేదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలపై జోక్యం చేసుకోవాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. బుధవారం నాటి విచారణలో ఓ లాయర్ ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రస్తావిస్తూ, కోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు స్పష్టంగా నిరాకరించింది. "మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా పాడుచేసుకోకండి" అని లాయర్‌కు సీజేఐ హితవు పలికారు. నీట్-యుజి 2026 పేపర్ లీక్, పరీక్షల నిర్వహణ తీరు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో సంస్కరణలు వంటి ప్రజా ప్రాముఖ్యత ఉన్న అంశాలపైనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని న్యాయవాది వాదించగా, "థ్యాంక్యూ వెరీ మచ్" అంటూ సీజేఐ ఆయన వాదనను అక్కడితో ముగించారు. అనంతరం, పోలీసుల అతిక్రమణలకు సంబంధించి లభ్యమైన వీడియోలను పరిశీలించాలని లాయర్ మళ్లీ కోరగా, "మాకు సమయం లేదు, ఆ వీడియోలు మేం చూడాలనుకోవడం లేదు" అని సీజేఐ తేల్చి చెప్పారు. కాగా, పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ దాఖలైన ఇలాంటి పిటిషన్‌పై అత్యవసర విచారణ జరిపేందుకు మంగళవారమే ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. "కోర్టును ఈ వ్యవహారంలోకి లాగవద్దు" అని హైకోర్టు స్పష్టం చేసింది. నీట్-యుజి పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రధానంగా నిరసనలు నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువత జర్నలిజం, సామాజిక ఉద్యమాల వైపు రావడంపై గతంలో సీజేఐ సూర్య కాంత్ స్పందిస్తూ 'కాక్రోచ్' (బొద్దింకలు) అనే పదాన్ని వాడగా, ఆ వ్యాఖ్యల ఆధారంగానే ఈ వ్యంగ్య వేదిక ఏర్పడటం గమనార్హం. ఆ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో, తాను నకిలీ డిగ్రీలు ఉన్న వారిని ఉద్దేశించి మాత్రమే ఆ మాట అన్నానని సీజేఐ తదనంతరం వివరణ ఇచ్చారు.

# బస్తీమే సవాల్..

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్మూర్ రాజకీయాల్లో ఇటీవల సవాళ్లు, ప్రతిసవాళ్లు, విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన చోట వ్యక్తిగత ఆరోపణలు, వివాదాస్పద వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నేతల వ్యాఖ్యలు స్థానిక రాజకీయాలను మరింత ఉద్రిక్తంగా మారుస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన నాయకులు పరస్పర విమర్శలతోనే కాలం గడుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి అంశాలపై ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుల బాధ్యతే అయినప్పటికీ, ఆ విమర్శలు వ్యక్తిగత స్థాయికి వెళ్లడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**అప్పుడు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి.. ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి**

గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏ. జీవన్ రెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. వినయ్ రెడ్డి మధ్య తీవ్ర స్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకున్నాయి. అభివృద్ధి, ఎన్నికల హామీలు, ఆర్థిక వ్యవహారాలపై ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం అప్పట్లో రాజకీయ చర్చకు దారితీసింది. అనంతరం పరిస్థితి కొంత సద్దుమణిగింది. తాజాగా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఆర్మూర్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని, స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కమిషన్ల కోసమే కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారని, ప్రజా అవసరాలు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అదే సమయంలో ఎన్నికల హామీల అమలుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అయితే కాంగ్రెస్ నాయకుల బంగారు గొలుసులు, స్కూటర్ షోరూమ్‌ల గురించి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుత రాజకీయాలకు అనుకూలం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**విమర్శలు ఉండాలి.. కానీ హద్దులు దాటకూడదు**

రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే. అయితే అవి ప్రజా సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలకే పరిమితమైతే ప్రజాస్వామ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. వ్యక్తిగత ఆరోపణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని ఉద్రిక్తం చేయడమే కాకుండా ప్రజల్లో రాజకీయాలపై ప్రతికూల అభిప్రాయం కలిగించే ప్రమాదం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రచారం కోసం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కంటే ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంశాలపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని స్థానికులు, రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించి రాజకీయ చర్చలను ప్రజా ప్రయోజనాల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నేపాల్ ప్రధాని బాలెన్ షా యూటర్న్..



**నేపాల్ :** విదేశీ రాయబారులతో వ్యక్తిగతంగా సమావేశాలు నిర్వహించబోనన్న తన స్వీయ విధానానికి నేపాల్ ప్రధాని బలేన్ షా వెనక్కి తగ్గారు. భారత్, చైనా రాయబారులతో ఈ వారం విడివిడిగా సమావేశం కానున్నట్లు నేపాల్ మీడియా వెల్లడించింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బలేన్ షా విదేశీ రాయబారులతో ఒకరితో ఒకరు సమావేశాలు నిర్వహించకుండా, సమిష్టి సమావేశాలకే పరిమితమయ్యారు. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, చైనా ప్రతినిధులు, అమెరికా ఉన్నతాధికారులతో కూడా వ్యక్తిగత భేటీలను ఆయన తిరస్కరించారు. ఈ వైఖరిపై మాజీ దౌత్యవేత్తలు, రాజకీయ విశ్లేషకులు, మీడియా నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

**ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు..**

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తైన అనంతరం షా తన వైఖరిని మార్చుకున్నారు. నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్వయంతో భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ, చైనా రాయబారి జాంగ్ మావోమింగ్‌లతో ఒకే రోజు విడివిడిగా సమావేశం కానున్నట్లు సమాచారం. ఇరు పొరుగు దేశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చాటిచెప్పడమే ఈ నిర్ణయం ఉద్దేశమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నేపాల్ విదేశాంగ ప్రయోజనాల దృష్ట్యా భారత్, చైనాతో సన్నిహిత దౌత్య సంబంధాలు కొనసాగించడం అవసరమని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో బలేన్ షా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, యువత ఆందోళనల మద్దతుతో గత ప్రభుత్వాన్ని గద్దెదించి ఈ ఏడాది మార్చిలో బాలెన్ షా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి విదేశీ ప్రతినిధులను ఏకాంతంగా కలవడానికి నిరాకరిస్తూ, గత ఏప్రిల్, మే నెలల్లో కేవలం ఉమ్మడి సమావేశాలు మాత్రమే నిర్వహించారు.




# హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ధర్నా

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీల అరెస్ట్‌ను నిరసిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మహా ధర్నా నిర్వహించాయి. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మంత్రి పొన్నం తీవ్రంగా మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని, బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని, కేంద్ర హోంశాఖ మంత్రి సమాధానం చెప్పాలన్నారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఢిల్లీ హింసపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

# రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి

## మిర్యాలగూడలో హోరెత్తిన కాంగ్రెస్ నిరసనలు.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్‌కు నిరసనగా మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో సుమారు 1000 మంది విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు.ర్యాలీ అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద-ఎత్తున నినాదాలు చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని, ప్రతిపక్షాల గొంతును అణిచివేసే ప్రయత్నం చేస్తోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్రంగా విమర్శించారు.ప్రజల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనని అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని,ఆ హక్కును హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.రాజకీయ కక్ష సాధింపు చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, వెంటనే కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని నిర్బంధాల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,విద్యార్థులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ,మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు...

# తిమ్మయ్య కుంటలో చెత్త వేయవద్దు




**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ శివారులోని 'తిమ్మయ్య కుంట'లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వెంటనే నిలిపివేయాలని ముదిరాజ్ సోదరులు విజ్ఞప్తి చేశారు. కుంటలో వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయమై బుధవారం తలకొండపల్లి ఎమ్మార్వో కే.ర మేష్, ఆర్ఐ శ్రీకాంత్, స్థానిక ఎంపీఓతో పాటు గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచ్ సప్పిడి ఆంజనేయులకు రాంపూర్ గ్రామ ముదిరాజ్ సోదరులు వినతిపత్రం అందజేశారు. జీవనాధారాన్ని దెబ్బతీస్తున్న కాలుష్యం. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామ మత్స్యకార సొసైటీ నాయకులు మాట్లాడుతూ: చెత్తాచెదారం వల్ల నీరు విషపూరితంగా మారి జీవరాశులకు, పశువులకు తాగడానికి పనికిరాకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా చేపల పెంపకం తీవ్రంగా దెబ్బతిని, తమ జీవనాధారం కోల్పోతున్నామని వాపోయారు. కుంటలో చెత్త పడేయకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని, చెత్త సేకరణను క్రమబద్ధీకరించి తిమ్మయ్య కుంటను కాపాడాలని అధికారులను కోరారు.వినతిపత్రం స్వీకరించిన ఎమ్మార్వో, ఎంపీఓ మరియు సర్పంచ్ సానుకూలంగా స్పందిస్తూ... సమస్య పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ చైర్మన్ చిల్కం బిక్షపతి ముదిరాజ్, వైస్ చైర్మన్ సప్పిడి కృష్ణయ్య ముదిరాజ్, సెక్రెటరీ చిల్కం శేఖర్ ముదిరాజ్, జిపిఓ శ్రీశైలం, ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు సప్పిడి పాండు, ఉపాధ్యక్షులు రొయ్యల రమేష్ సొసైటీ డైరెక్టర్లు తిక్కల యాదయ్య, తిక్కల మహేష్, సప్పిడి రమేష్, సప్పిడి యాదమ్మ, సప్పిడి జంగయ్య, మియ్యాడి అమృత మరియు ముదిరాజ్ సోదరులు సప్పిడి శివకుమార్, రొయ్యల మహేష్, చిల్కం నరేష్, తిక్కల శివ, రొయ్యల మల్లేష్, ముక్తాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ పట్టణంలో సెల్లార్‌ల తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు








**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ పట్టణంలో భవన నిర్మాణ అనుమతుల ప్రకారం పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్‌లను ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భవనాలపై పురపాలక సంఘం జనగామ కమిషనర్ గారు టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లను దుకాణాలు, గోదాములు లేదా ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్న భవన యజమానులకు నోటీసులు జారీ చేయబడినవి. సెల్లార్ ప్రదేశాన్ని పూర్తిగా వాహన పార్కింగ్‌కే వినియోగించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నిబంధనలు పాటించని భవన యజమానులపై తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం మరియు అమలులో ఉన్న టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం జరిమానాలు, సీజ్ మరియు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అధికారులు హెచ్చరించారు.జనగామ పట్టణంలోని అన్ని భవన యజమానులు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించి, సెల్లార్‌లను పార్కింగ్‌కే వినియోగించాలని పురపాలక సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ తనిఖీలు రాబోయే రోజుల్లో కూడా నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ గారు ఫైర్ డిపార్ట్మెంట్ బి జగదీశ్వర్ ఐసి ఫైర్ ఆఫీసర్ జనగాం గారు టౌన్ ప్లానింగ్ విభాగం పవన్ కుమార్ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్స్ వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# చంద్రధన లో విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

## గ్రామ ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం సర్పంచ్ సొల్లు రంగమ్మ








**చంద్రధన,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా చంద్రధన గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ అధ్వర్యంలో ఎల్.బి. నగర్ కామినేని హాస్పిటల్ వారి సహకారంతో, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. 220 మందికి పైగా వైద్య పరీక్షలు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కంటి సమస్యలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే జ్వరం, జలుబు, శారీరక బలహీనత మరియు నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్యుల సలహా మేరకు తగిన మందులు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా గ్రమ సర్పంచ్ సొల్లు రంగమ్మ మాట్లాడుతూ. గ్రామ ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అనే సంకల్పంతో గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఉచిత వైద్య శిబిరం ముఖ్య ఉద్దేశం అన్నారు.గ్రామీణులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిన ఈ వైద్య శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఎల్.బి. నగర్ కామినేని హాస్పిటల్ వైద్య బృందానికి గ్రామ పంచాయతీ మరియు గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి, వార్డు సభ్యులు ఓర్సు రాజు (అంకుష్), అజయ్ యాదవ్, ఓర్సు బాలరాజ్, విఆర్ఎ చంద్రమౌళి, పాలాది కృష్ణయ్య, సుధాకర్ రెడ్డి, కామినేని ఆసుపత్రి వైద్య బృందం, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాల ఇండ్ల నిర్మాణానికి అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్టు




**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
కల్వకుర్తి మండలం, రఘుపతి పేట గ్రామానికి నిరుపేద కుటుంబానికి చెందిన మల్లె కేడి నరేందర్. నిర్మాణ దశలో ఉన్న ఇల్లు పూర్తి చేసుకోవడానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆపన్నహస్తం అందించింది.రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, స్థానిక మాజీ జడ్పీటీసీ మరియు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో. (ఫినిషింగ్) పనుల నిమిత్తం సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమకు సమయానికి సిమెంట్ అందించి ఆదుకున్న ఉప్పల వెంకటేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తూ అండగా నిలుస్తున్న ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు.

# రాంపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే మా లక్ష్యం సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్





**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
రాంపూర్ గ్రామ పంచాయతీలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఎల్.బి. నగర్‌లోని కామినేని హాస్పిటల్ సహకారంతో, గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ శిబిరంలో గ్రామస్థులకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కంటి సంబంధిత సమస్యలతో పాటు జ్వరం, జలుబు, శారీరక బలహీనత, శరీర నొప్పులు వంటి సాధారణ సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం" అనే లక్ష్యంతో చేపట్టిన ఈ వైద్య శిబిరం గ్రామస్థులకు ఎంతగానో ఉపయోగపడిందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సేవలు అందించిన కామినేని హాస్పిటల్

వైద్య బృందానికి గ్రామ ప్రజల తరఫున, పంచాయతీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, గ్రామ సెక్రెటరీ రవీందర్, జిపిఓ శ్రీశైలం. వార్డు సభ్యులు: సప్పిడి సునీత, దొరిబాయి లాలమ్మ-జంగయ్య, కటికల మధు యాదవ్, కాకి రాము, పెరుమళ్ళ నరేష్. చెరువు కమిటీ బాధ్యులు: చెరువు చైర్మన్ చిలికం బిక్షపతి, జనరల్ సెక్రెటరీ చిల్కం శేఖర్, డైరెక్టర్లు తిక్కల యాదయ్య, తిక్కల మహేష్. మాజీ ప్రజాప్రతినిధులు: మాజీ సర్పంచ్ మనమ్మ-యాదయ్య, మాజీ ఎంపిటిసి కటికల భీమమ్మ-యాదయ్య, హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ జానయ్య, లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ మాజీ చైర్మన్ ముక్తాల రాఘవేందర్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనే-యులు. గ్రామ పెద్దలు & యువ నాయకులు: ముక్తాల నరసింహ, యామ లక్ష్మణ్, తిక్కల అంజయ్య, షర్ఫుద్దీన్, రొయ్యల రమేష్, బోదాస్ నరసింహ, రొయ్యల మహేష్, రొయ్యల పెద్దయ్య, చిలుకం నరేష్, తిక్కల శివ, వినోద్, రొయ్యల అనిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై తీసుకున్న చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి



**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ రాస్తారోకో నిర్వహించారు. ప్రజాస్వామ్య హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతును నొక్కివేసే ప్రయ-త్నం చేస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు.దేశంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొంటూ, విభిన్న అభి-ప్రాయాలను అణచివేయడం, ప్రతిపక్ష నాయకులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని విమర్శించారు. రాహుల్ గాంధీపై తీసుకున్న చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగిన రాస్తారోకో కారణంగా కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్రం రవి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, లంక మల్లారం సర్పంచ్ పూనెం రమేష్, సమితి సింగారం సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, కూచిపూడి బాబు, ఎన్ఎస్‌యూఐ నాయకులు త-రుణ్ రెడ్డి, ఆరిఫ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొని ఆందోళనకు సంఘీభావం తెలిపారు.



# నయా బ్యాటింగ్-బౌలింగ్ లైనప్..

భారత్, జింబాబ్వే మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు రంగం సిద్ధమైంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా గురువారం (జూలై 23) తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనలో బోల్తాపడ్డ టీమిండియా.. జింబాబ్వేపై గెలవాలని పట్టుదలగా ఉంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఈ సిరీస్‌లో పలు మార్పులతో బరిలోకి దిగనుంది. సీనియర్ ఆటగాళ్లు సంజు శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి ఇవ్వడంతో.. యువ ఆటగాళ్లకు అవకాశాలు దక్కనున్నాయి. మొదటి టీ20లో టీమిండియా ప్లేయింగ్ 11 ఎలా ఉండనుందో ఓసారి చూద్దాం.

**బుడ్డోడికి మరో అవకాశం:**

ఇంగ్లండ్ పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ తొలి మూడు టీ20ల్లో నిరాశపరిచాడు. 14, 13, 15 పరుగులతో 42 పరుగులే చేయడంతో చివరి టీ20లో అవకాశం కోల్పోయాడు. జింబాబ్వే సిరీస్‌కు సంజు శాంసన్ ఎంపికకాకపోవడంతో బుడ్డోడికి జింబాబ్వే సిరీస్‌లో మరో అవకాశం లభించనుంది. ప్రపంచ నంబర్-2 టీ20 బ్యాటర్ అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. జింబాబ్వే పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో.. ఈసారి తన సహజమైన దూకుడు ఆటను ప్రదర్శించాలని వైభవ్ భావిస్తున్నాడు. అభిషేక్ శర్మకు జింబాబ్వే గడ్డపై మంచి రికార్డు ఉంది. ఇదే వేదికపై టీ20ల్లో అరంగేట్రం చేయడంతో పాటు తన తొలి అంతర్జాతీయ సెంచరీని కూడా నమోదు చేశాడు. దాంతో ఈ ఇద్దరిపై అంచనాలు భారీగా ఉన్నాయి.

**మళ్లీ తుది జట్టులోకి రింకూ సింగ్:**

మూడో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్‌కు రానుండగా.. నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆడనున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ అయినప్పటికీ.. శ్రేయస్ జట్టును విజయపథంలో నడిపించలేకపోయాడు. జింబాబ్వే పర్యటనలో మాత్రం ఆ లోటును భర్తీ చేయాలని చూస్తున్నాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఆడుతాడు. ఫినిషర్ రింకూ సింగ్ మళ్లీ తుది జట్టులోకి అడుగుపెడుతున్నాడు. హార్దిక్ పాండ్యా గాయంతో దూరమవ్వడంతో శివమ్ దూబే ప్రధాన పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా బరిలోకి దిగనున్నాడు.

**కొత్త బంతిని అందుకోనున్న ప్రిన్స్, మయాంక్:**

బౌలింగ్ విభాగంలో కూడా భారీ మార్పులు ఉండనున్నాయి. స్పిన్ విభాగానికి రవి బిష్ణోయ్ నాయకత్వం వహించనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా హర్ష్ దూబేకు అవకాశం దక్కనుంది. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ అందుబాటులో లేకపోవడంతో ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్‌లు కొత్త బంతిని అందుకోనున్నారు. యువ పేసర్ అశోక్ శర్మకు అవకాశం ఇవ్వాలనుకుంటే.. ఇటీవల తేలిపోతున్న శివమ్ దూబే స్థానంలో ఆడించే అవకాశాలు లేకపోలేదు. చూడాలి మరి అశోక్ శర్మకు ఛాన్స్ దక్కుతుందో లేదో.

**టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ (అంచనా):**

వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే/అశోక్ శర్మ, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.

# క్రికెట్ చరిత్రలో తొలిసారి..



క్రికెట్ ప్రియులను ఎంతగానో అలరించే లీగ్స్‌లో 'ది హండ్రెడ్ లీగ్' ఒకటి. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ లీగ్‌కు ఎంతో ఆదరణ ఉంది. మంగళవారం ప్రారంభమైన 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ ఫ్రాంచైజీలు శుభారంభం చేశాయి. ఒకేసారి ప్రారంభమైన హండ్రెడ్ మెన్స్, హండ్రెడ్ ఉమెన్స్ టోర్నీల్లో ఈ జట్లు విజయాలను అందుకున్నాయి. పురుషుల హండ్రెడ్ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ లండన్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరోవైపు మహిళల విభాగంలో మెన్స్ విభాగానికి భిన్నమైన ఫలితం వచ్చింది. ముంబై ఇండియన్స్ లండన్‌పై సన్‌రైజర్స్ లీడ్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇలా ఏకకాలంలో రెండు జట్లు వేరేవేరు విభాగాల్లో ఒకదానిపై మరొకటి విజయాలు నమోదు చేయడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి.పురుషుల హండ్రెడ్ లీగ్ మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ 99 బంతుల్లో 143 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (41 పరుగులు), టామ్ అల్సోప్ (31 పరుగులు) దూకుడుగా ఆడారు. ముంబై బౌలర్లలో రిచర్డ్ గ్లెసన్ 4 వికెట్లు తీయగా, సామ్ కరన్ రెండు వికెట్లు సాధించాడు. అనంతరం 144 పరుగుల టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ లండన్ జట్టు 84 బంతుల్లోనే 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. కెప్టెన్ సామ్ కరన్ (60 నాటౌట్), నికోలస్ పూరన్ (58 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు.ఇక మహిళల హండ్రెడ్ టోర్నీ విషయానికొస్తే.. ఓవల్ వేదికగా ఎంఐ, ఎస్ఆర్ మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ ఓడిన ముంబై ఇండియన్స్ లండన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. ఈ క్రమంలో నిర్ణీత 100 బంతుల్లో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. హేలీ మాథ్యూస్ (33), డానీ వ్యాట్ (29) రాణించారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, డానియెల్లి గిబ్సన్‌లు చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగి సన్‌రైజర్స్ 69 బంతుల్లోనే 3 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఫోబె లిచ్‌ఫీల్డ్ (43), అనాబెల్ సదర్లాండ్ (30) విజయంలో కీలకపాత్ర పోషించారు. సన్‌రైజర్స్ లీడ్స్ తదుపరి మ్యాచ్ ఈ నెల 25న సదరన్ బ్రేవ్ జట్టుతో తలపడనుంది.



# శ్రీలంకతో టెస్టు సిరీస్..

శ్రీలంకతో జరిగే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియా జట్టు ఎంపికపై ఆసక్తి నెలకొంది. ఈ వారంలోనే భారత టెస్టు జట్టును బీసీసీఐ సెలెక్టర్లు ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్ సెలెక్టర్లకు ప్రధాన సమస్యగా మారింది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం నుంచి కోలుకుంటున్న సుందర్.. సమయానికి పూర్తిగా ఫిట్‌గా ఉంటాడా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. సుందర్ స్థానంలో టీమిండియాలోకి కొత్త ప్లేయర్ రానున్నాడని తెలుస్తోంది.సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రానుండటం దాదాపు ఖాయం. వీరిద్దరి రాకతో భారత జట్టు బౌలింగ్ బలోపేతం కానుంది. గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ, సౌరభ్ సుతార్, కుల్దీప్ యాదవ్‌లు జట్టులో కొనసాగనున్నారు. జట్టు కూర్పులో మరో ఆసక్తికర అంశం నితీష్ కుమార్ రెడ్డి. నితీష్ రెడ్డి లేదా ప్రత్యేక బ్యాటర్‌కు అవకాశం దక్కుతుందనే దానిపై ఆసక్తి నెలకొంది. జట్టు సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకోనున్నారు.ఒకవేళ వాషింగ్టన్ సుందర్ జట్టుకు దూరమైతే.. అతని స్థానంలో కొత్త ఆటగాడు సారాంశ్ జైన్‌కు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. 33 ఏళ్ల సారాంశ్ శ్రీలంక 'ఎ' జట్టుతో ఇటీవల జరిగిన రెండు అనధికారిక టెస్టుల సిరీస్‌లో భారత్ 'ఎ' తరఫున ఏడు వికెట్లు పడగొట్టాడు. అలాగే లోయర్ బ్యాటింగ్ చేయగలడు. 54 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 2223, 47 లిస్ట్ ఏ మ్యాచ్‌లలో 553, 21 టీ20లో 37 రన్స్ చేశాడు. అలానే వరుసగా 188, 38, 18 వికెట్స్ పడగొట్టాడు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, ధృవ్ జురెల్ బ్యాటింగ్ విభాగంలో ఎంపిక కానున్నారు.శ్రీలంక పర్యటనకు ముందు భారత జట్టు నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ ట్రైనింగ్ క్యాంప్‌లో ఆటగాళ్లు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సిద్ధమయ్యే అవకాశం ఉంది. అనంతరం జట్టు శ్రీలంకకు బయల్దేరి టెస్టు సిరీస్‌కు ముందు వార్మప్ మ్యాచ్ కూడా ఆడనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఈ సిరీస్ ఇరు జట్లకూ ఎంతో కీలకం. అందుకే సెలెక్టర్లు పటిష్ట జట్టును ఎంపిక చేయడంపై దృష్టి పెట్టారు. సుందర్ ఫిట్‌నెస్ నివేదిక వచ్చిన తర్వాతే తుది జట్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బిజినెస్




# చమురు మంటలు..


అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర తిరిగి 90 డాలర్లు దాటింది. ప్రస్తుతం 1.2 శాతం పెరిగి 92 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. మరోవైపు ట్రంప్ టారిఫ్‌ల ప్రకటన నేపథ్యంలో ఫార్మా ఇండస్ట్రీ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 96.32గా ఉంది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (77,470)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం వంద పాయిట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు దిగజారింది. తిరిగి 77 వేల మార్క్ దిగువకు చేరుకుంది. ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 572 పాయింట్ల నష్టంతో 76,897 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 168 పాయింట్ల నష్టంతో 24,019 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో టీవీఎస్ మోటార్స్, కల్యాణ్ జువెల్లర్స్, బజాజ్ ఆటో, నైకా మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. బంధన్ బ్యాంక్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, లూపిన్, ప్రీమియర్ ఎనర్జీస్, గ్లెన్‌మార్క్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 559 పాయింట్ల నష్టంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 568 పాయింట్ల నష్టంతో ఉంది.



# పసిడి ప్రియులకు భారీ షాక్


గత కొద్ది రోజులుగా రూ. వెయ్యి లోపు తగ్గుతూ, పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు బుధవారం రోజు పసిడి ప్రియులకు తీవ్ర షాక్ ఇచ్చాయి. దేశీయంగా బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగి సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 2,290 మేర పెరిగి రూ. 1,46,510 మార్కుకు చేరుకుంది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రేటు కూడా రూ. 2,100 పెరిగి రూ. 1,34,300 వద్ద నిలిచింది. పసిడి బాటలోనే వెండి కూడా పరుగులు తీస్తుండటంతో కొనుగోలుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.అలాగే మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగి అంబరాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ. 2,40,000 మార్కును తాకి వినియోగదారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అషాడమాసం వేళ బంగారం, వెండి ధరలు ఇలా ఆకాశాన్నంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, మార్కెట్ తీవ్రతల వల్లే ఈ స్థాయిలో ధరల పెరుగుదల నమోదవుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఏఐ బూమ్‌తో భారత్‌లో డేటా సెంటర్ల జోరు



భారత్‌లో డేటా సెంటర్ రంగం భారీ విస్తరణ దశలోకి అడుగుపెట్టింది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), 5జీ, ఈ-కామర్స్, యూపీఐ, ఓటీటీ వంటి డిజిటల్ సేవల వినియోగం వేగంగా పెరుగుతుండటంతో 2030 నాటికి దేశంలోని డేటా సెంటర్ల ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 2025లో ఉన్న 1.5 గిగావాట్ల నుంచి 6.5 గిగావాట్లకు, అంటే నాలుగు రెట్లకు పైగా పెరగనుందని రూబిక్స్ డేటా సైన్సెస్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నాటికి దేశంలో 271 డేటా సెంటర్లు ఉండగా, వాటిలో దాదాపు 65 శాతం ముంబై, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై నగరాల్లోనే ఉన్నాయి. ముఖ్యంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజాల పెట్టుబడులతో ఈ రంగంలో ప్రతిపాదిత పెట్టుబడులు 90 బిలియన్ డాలర్ల(రూ. 8.67 లక్షల కోట్ల)కు చేరడం విశేషం. ప్రపంచ డేటాలో దాదాపు 20 శాతం భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దేశం వాటా ఇంకా 3-4 శాతమే కావడం వల్ల వృద్ధికి భారీ అవకాశం ఉందని రూబిక్స్ డేటా సైన్సెస్ పేర్కొంది. అయితే ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే పెట్టుబడులతో పాటు ప్రాజెక్టులను వేగంగా అమలు చేసే సామర్థ్యమే పరిశ్రమకు అసలైన పరీక్షగా మారనుందని సంస్థ అభిప్రాయపడింది.

# ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు!




తమ మొబైల్ ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా మర్చంట్ పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) వద్ద కస్టమర్లు యూపీఐ చెల్లింపులు చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతిపాదిత విధానం ద్వారా ఫోన్, పీఓఎస్ రెండింటికీ ఇంటర్నెట్ లేకున్నా చెల్లింపులు చేసే అవకాశం కలగనుంది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సదుపాయం ఉన్న ఫోన్‌ను పీఓఎస్ టెర్మినల్ వద్ద టాప్ చేసి యూపీఐ లైట్ బ్యాలెన్స్ నుంచి గరిష్ఠంగా రూ.2,000 వరకు చెల్లింపులు చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో ఉండని విమాన క్యాబిన్లు, భూగర్భ రైలు నెట్‌వర్క్ వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నట్టు సమాచారం. ఈ విధానానికి సంబంధించి ప్రముఖ టెర్మినల్ మాన్యుఫ్యాక్చరర్లు తయారు చేసిన పీఓఎస్ డివైజ్‌లను సర్టిఫై చేసే ప్రక్రియను ఈ ఏడాదిలోనే ఎన్‌పీసీఐ ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. ఇంటర్నెట్ ఉన్నప్పుడు కస్టమర్లు తమ ఫోన్‌లోని యూపీఐ లైట్ వ్యాలెట్‌లో సొమ్మును లోడ్ చేసుకోవాలి. ఆ సొమ్మును ఆఫ్‌లైన్ టెర్మినల్ వద్ద యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయకుండానే చెల్లింపులు చేసేయవచ్చు. ఈ లావాదేవీని టెర్మినల్ స్టోర్ చేసుకుంటుంది. ఎప్పుడైతే ఇంటర్నెట్‌కు కనెక్ట్ అవుతుందో అప్పుడు దాన్ని వెరిఫికేషన్ కోసం పంపుతుంది. ఆఫ్‌లైన్‌లో యూపీఐని అనుమతించేందుకు పీఓఎస్ కంపెనీలు ఎన్‌పీసీఐ నుంచి సర్టిఫికేషన్‌ను పొందాల్సి ఉంటుంది. బ్యాంకులు, థర్డ్ పార్టీ యూపీఐ అప్లికేషన్ ప్రొవైడర్లు తమ యాప్‌లలో ఈ సదుపాయాన్ని కల్పించే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది.




# నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు

నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఇతిహాసగాథ 'రామాయణ'. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ ఈ ఏడాది దీపావళి సందర్భంగా థియేటర్స్‌లోకి రాబోతుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, లక్షణుడిగా రవి దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, రావణాసురుడిగా యష్,మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్, కనిపించబోతున్నారు. అంతేకాకుండా ఇందులో రకుల్ ప్రీత్‌సింగ్ కూడా కీలక పాత్రలో నటించారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ లాంచ్ వేడుకలు ఢిల్లీలో ఎంతో వైభవంగా జరిగాయి. మన దేశ సంస్కృతి, హిందూ పురాణాలు, భక్తి భావంతో ముడిపడి ఉన్న ఈ సినిమా వేడుకకు నటీనటులంతా ఎంతో పద్ధతిగా హాజరయ్యారు. ముఖ్యంగా ఇదే సినిమాలో సీత పాత్ర పోషిస్తున్న సాయి పల్లవి సాంప్రదాయబద్ధంగా వచ్చి అందరి ప్రశంసలు అందుకుంది. అయితే రకుల్ ప్రీత్ సింగ్ మాత్రం స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో అత్యంత గ్లామరస్‌గా ఈవెంట్‌కు హాజరైంది.ఎంతో పవిత్రంగా భావించే 'రామాయణ' లాంటి చారిత్రాత్మక సినిమా వేడుకలో మోతాదుకు మించిన గ్లామర్ ప్రదర్శించడం ఏంటని నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు. సందర్భాన్ని బట్టి ఎలాంటి దుస్తులు ధరించాలో కనీస అవగాహన ఉండక్కర్లేదా అని సోషల్ మీడియాలో రకుల్‌పై తీవ్రస్థాయిలో ట్రోలింగ్ మొదలైంది. తాజాగా, ఈ విషయంపై రకుల్ ట్రోల్స్‌పై రియాక్ట్ అయ్యారు. తనపై జరుగుతున్నదంతా కేవలం కావాలని చేస్తున్న నెగెటివ్ ప్రచారమని, ఈమధ్య సోషల్ మీడియాలో నెగెటివిటీ బాగా ఎక్కువైపోయిందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. అయితే రకుల్ వివరణపై సినీ ప్రియులు, నెటిజన్లు సంతృప్తి చెందకపోగా మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ ఈవెంట్‌కు ఎలా వెళ్లాలో, సందర్భానికి తగ్గట్టు ఎలా ప్రవర్తించాలో మర్చిపోయి గ్లామర్ షో చేయడం.. ఆ తర్వాత తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సోషల్ మీడియాను, నెటిజన్లను బ్లేమ్ చేయడం సరికాదని రకుల్‌కు గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు. తప్పును ఒప్పుకోకుండా ఎదురుదాడి చేయడం వల్ల ఆమెపై నెగెటివిటీ మరింత పెరుగుతోందని కామెంట్లు చేస్తున్నారు.

# విజయ్ ముందు భారీ టార్గెట్స్..



జననాయకుడు విడుదలకి ఇంకా కొన్ని గంటలే మిగిలి ఉంది. జులై 23న రిలీజ్ కాబోతున్న ఈ మూవీని భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. 30 దేశాల్లో 8 వేల స్క్రీన్స్‌లో స్క్రీనింగ్ కాబోతుంది. టాలీవుడ్ ఫిల్మ్ భగవంత్ కేసరికి రీమేక్ అయినా కూడా తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విడుదల చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్టయ్యాయి. తమిళనాడులో హాట్ కేకుల్లా అమ్మడౌతున్నాయట టికెట్స్.జననాయగన్ ప్రమోషన్స్‌లో దర్శకుడు హెచ్ వినోద్ ఫుల్ బిజీగా గడుపుతున్నాడు. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో వరుస ఇంటర్వ్యూలిచ్చేసి మూవీని మరింత ప్రమోట్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమాతో విజయ్ ముందు భారీ టార్గెట్స్ వెయిట్ చేస్తున్నాయి. ఇప్పటి వరకు కోలీవుడ్‌లో థౌజండ్ క్రోర్ అందుకున్న హీరోనే లేడు. విజయ్ ఈ నంబర్ టచ్ చేస్తే.. ఈ ఏడాది సీఎంగా ఓ ఎచీవ్ మెంట్‌తో పాటు వెయ్యికోట్లు నమోదు చేసిన తొలి కోలీవుడ్ హీరోగా హిస్టరీలో అతడి పేరు నిలిచిపోతుంది. తమిళనాడులో రికార్డ్స్ సృష్టించాలన్నా, తిరగరాయాలన్నా రజనీకాంత్‌కే చెల్లింది. ఇప్పటి వరకు కోలీవుడ్ హయ్యెస్ట్ గ్రాసర్ చిత్రం తలైవర్ పేరిటే నమోదైంది. రోబో 2.0 రూ. 800 కోట్లతో ఫస్ట్ ప్లేస్, రూ. 600 కోట్లతో జైలర్ సెకండ్ ప్లేస్ ఆక్యుపై చేసుకున్నాయి. వీటిని బీట్ చేయాల్సిన టార్గెట్ విజయ్ ముందుంది. అంతేకాదు ఫస్ట్ డే కలెక్షన్స్‌లో కూడా తలైవర్‌దే పై చేయి. కూలీ ఫస్ట్ డే రూ. 151 కోట్లు కొల్లగొట్టి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రంగా నిలిచింది. లియో రూ. 148 కోట్లతో రెండో స్థానానికి పడిపోయింది. ఇప్పుడు కూలీ ఫస్ట్ డే కలెక్షన్స్ బీట్ చేసి విజయ్ దళపతి హిస్టరీ క్రియేట్ చేస్తాడో లేదో చూద్దాం.



# రికార్డు సృష్టించిన ధనుష్

తమిళ స్టార్ హీరో ధనుష్, దర్శకుడు మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలను నెలకొల్పింది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రస్తుతం 'D56' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రకటించిన విషయం తెలిసిందే. అధికారిక ప్రకటన వెలువడినప్పటి నుంచే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నప్పటికీ, అంతకుముందే డిజిటల్ హక్కులు భారీ ధరకు అమ్ముడైనట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.ఇటీవల కొన్ని చిత్రాలు షూటింగ్ పూర్తయినా కూడా ఓటీటీ ఒప్పందాలు కుదరడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 'D56' మాత్రం షూటింగ్ ప్రారంభానికి ముందే భారీ డిజిటల్ డీల్‌ను సొంతం చేసుకోవడం విశేషంగా మారింది. ఈ డీల్‌తో ధనుష్ మరోసారి తన మార్కెట్‌ను నిరూపించుకున్నారని, 'D56' ఓటీటీ హక్కుల విషయంలో కొత్త రికార్డు నమోదైందని కోలీవుడ్ మీడియా పేర్కొంటోంది. ఇక ఈ చిత్రంలో కథానాయికగా ఎవరు నటించనున్నారనే విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. అయితే సాయి పల్లవి, రుక్మిణి వసంత్, సారా అర్జున్ పేర్లు సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తున్నాయి.

# అది నాకు దక్కిన పెద్ద గౌరవం




బుల్లితెరపై సంచలనం సృష్టించిన 'చిన్నారి పెళ్లికూతురు' ద్వారా పరిచయంపై ఫుల్ పాపులారిటీ దక్కించుకున్నారు అవికా గోర్. ఆ తర్వాత సినిమాలపై ఆసక్తితో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చారు. తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించిన ఈ భామ కెరీర్ పీక్స్‌లో ఉ ండగానే తన ప్రియుడి మిలింద్‌ను పెళ్లి చేసుకున్నారు. ఇక ఇటీవల సైకలాజికలం రొమాంటిక్ థ్రిల్లర్ 'అగ్లీ స్టోరీ'తో సరికొత్త అనుభూతిని అందించారు. ఇదిలా ఉంటే.. తాజాగా, 'చిన్నారి పెళ్లి కూతురు' సీరియల్ ప్రారంభమై 18 ఏళ్లు పూ-ర్తయిన సందర్భంగా, నటి అవికా గోర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. "నేను ఆనంది పాత్రతో పాటే పెరిగాను. ఈ సీరియల్ నాకు కేవలం ఒక గుర్తింపు ఇవ్వడమే కాకుండా, ఒక మనిషిగా నన్ను ఎంతో మార్చింది.ఒక మంచి కథ సమాజంలో ఎంత గొప్ప మార్పు తీసుకురాగలదో నాకు ఆ రోజే అర్థ-మైంది. ఇప్పటికీ జనాలు నన్ను ఆనంది అని గుర్తుపెట్టుకుని అంతగా ప్రేమిస్తున్నారంటే, అది అవికాగా నాకు దక్కిన పెద్ద గౌరవం. ఆనంది పాత్ర నా జీవితాన్నే మార్చేసింది" అని చెప్పారు. షూటింగ్ స్పాటే తనకు నటన నేర్పిన మొదటి పా-ఠశాల అని అవికా చెప్పారు. కెమెరా ముందు ఎలా నటించాలి, భావాలు ఎలా చూపించాలి అనేది అక్కడే రోజూ సీనియర్ నటులను చూస్తూ నేర్చుకున్నానని తెలిపారు. అక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, ఓపికే ఈరోజు నటిగా తన ఎదుగుదలకు కారణమని అన్నారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసే పద్ధతిని ప్రశ్నిస్తూ, ఆడపిల్లల చదువు, వారి హక్కుల గురించి ఈ సీరియల్ బాగా చెప్పిందని అవికా గుర్తుచేశారు.




# పెళ్లి వల్ల రణబాలి వాయిదా?

విజయ్ దేవరకొండ, రష్మిక ముచ్చటగా మూడోసారి జతకట్టిన సినిమా 'రణబాలి'. విజయ్ కు లాస్ట్ హిట్ 'టాక్సీవాలా' ఇచ్చిన రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. ఒకవైపు హిట్ పెయిర్, మరోవైపు హిట్ కాంబినేషన్ రిపీట్ కావడంతో సినిమాపై హై ఎక్స్పెక్టేషన్స్ ఉన్నాయి. రెగ్యులర్ మూవీ కాకుండా పీరియాడికల్ జానర్ తో రూపొందుతోంది.రణబాలి షూటింగ్ మొదలైన వెంటనే సెప్టెంబర్ 11న రిలీజ్ అంటూ ప్రకటించారు నిర్మాతలు. మధ్యలో విజయ్ దేవరకొండ, రష్మిక పెళ్లి చేసుకోవడంతో షూటింగ్ కు బ్రేక్ పడింది. సెప్టెంబర్ 11 నాటికి సినిమాను రెడీ చేయడం కష్టమనే ఫీలింగ్ లో మేకర్స్ ఉ న్నారని, త్వరలోనే మరో రిలీజ్ డేట్ ప్రకటిస్తారు అని తెలిసింది.రణబాలి మరో రిలీజ్ డేట్ కోసం ట్రై చేస్తుంటే స్లాట్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. దసరాకు వద్దామనుకుంటే అక్టోబర్ 2న వెంకటేష్ 'ఆదర్శ కుటుంబం', అక్టోబర్ 15న 'జైలర్ 2' రిలీజ్ అవుతున్నాయి. దసరా అక్టోబర్ 20న కావడంతో 16న విడుదల చేస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన చేస్తున్నారు. నవంబర్ లో ఫ్రైడే స్లాట్స్ ఖాళీగా ఉన్నా, అన్‌సీజన్ లో రావాలనుకోవడం లేదు. డిసెంబర్ 3న ఆల్రెడీ 'ఫౌజీ' లైన్ లో ఉ ంది. పోనీ క్రిస్మస్ కు వద్దామనుకుంటే NBK109 ను డిసెంబర్ 24న రిలీజ్ కు సన్నాహాలు చేస్తున్నారు. దసరాకు 18 రోజుల ముందే ఆదర్శ కుటుంబం రిలీజ్ అవుతుంది. ఈ లెక్కన దసరా రేసులో జైలర్ 2 మాత్రమే దిగుతోంది. పండక్కి మరో సినిమా రావడానికి ఛాన్స్ ఉంది. ఆ అవకాశాన్ని రణబాలి ఉ పయోగించుకుంటుందేమో చూడాలి మరి.




# బుల్లితెర వీక్షకులను అలరించేందుకు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన మోస్ట్ యాంటిసిపేటెడ్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'OG'. సుజిత్ డైరెక్షన్ లో తెరెక్కిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయి పవర్ స్టార్ కంబ్యాక్ సినిమాగా నిలిచింది. కొన్నాళ్ళకు నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో రిలీజ్ అయిన OG అక్కడ కూడా మంచి రెస్పా-న్స్ తెచ్చుకుంది. ఇక ఇప్పుడు బుల్లితెర వీక్షకులను అలరించేందుకు సిద్ధవ-ంవుతోంది. భారీ అంచనాల నడుమ థియేటర్లు, ఓటీటీలలో సంచలనం సృష్టించిన ఈ సినిమా శాటిలైట్ హక్కులను ప్రముఖ టెలివిజన్ నెట్‌వర్క్ ఈటీవీ భారీ ఫ్యాన్సీ రేటుకి సొంతం చేసుకుంది.దర్శకుడు సుజీత్ స్టైలిష్ టేకింగ్, పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ ప్రెజెన్స్, అలాగే ఎస్ఎస్ తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కో-ర్‌తో రూపుదిద్దుకున్న OG మూవీ డిజిటల్ రైట్స్ ముందే ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అయినప్పటికీ శాటిలైట్ హక్కులు డీల్ క్లోజ్ కాలేదు. తాజాగా ఈటీవీ నెట్‌వర్క్ ఈ రైట్స్‌ను అధికారికంగా దక్కించుకోవడంతో పవన్ కళ్యాణ్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈటీవీ నెట్‌వర్క్ చరిత్రలోనే ఒక భారీ పాన్-ఇండియా రేంజ్ యాక్షన్ ఫిల్మ్ రైట్స్ దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడంతో ఈ టెలికాస్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. త్వరలోనే ఈటీవీలో 'OG' వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ కాబోతోంది. దాదాపు 28 ఏళ్ల తర్వాత, ఈటీవీ 'పవర్ స్టార్' చిత్రాన్ని సొంతం చేసుకుంది. సుస్వాగతం సినిమా తర్వాత ఈటీవీ దక్కించుకున్న పవర్ స్టార్ రెండవ చిత్రం OG. బుల్లితెరపై ఈ గ్యాంగ్‌స్టర్ చిత్రం టీఆర్పీ పరంగా కొత్త రికార్డులను నమోదు చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**